



సీఎం చంద్రబాబు సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ తేజ, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

పొన్నెకల్లుకు 14న సీఎం చంద్రబాబు

- అంబేడ్కర్ జయంతి వేడుకలకు ఏర్పాట్లు
- అధికారులు కలిసికట్టుగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశాలు

తాడికొండ(పొన్నెకల్లు), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ జయంతి వేడుకలకు తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామం వేదికగా ఎంపిక చేశారు. ఈ జయంతి వేడుకలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరుకానున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో గురువారం ఇన్‌చార్జి కలెక్టర్ ఏ.భార్గవతేజ, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో సమావేశాన్ని నిర్వహించి అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ పొన్నెకల్లులో రాష్ట్ర స్థాయిలో జరిగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని అధికారులందరు సమన్వయంతో విజయంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మురళీకృష్ణ, సీపీవో శేషశ్రీ, డీఆర్‌డీఏ డ్వామా పీడీ విజయలక్ష్మి, శంకర్, డీపీవో నాగసాయి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాబాయి, పౌర సరఫరాల అధికారి కోమలి పద్మ,తాహసీల్దార్లు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేషన్ మాఫియా.. బరితెగింపు

- సివిల్ సప్లయిస్ గోతాల్లోనే తరలింపు
- కీలక నేతలకు భారీగా ముడుపులు
- అధికారం అండతో రెచ్చిపోతున్న మాఫియా

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గుట్టుమట్టూ లేదు.. భయం అంతకన్నా లేదు.. అడిగే వారు లేరు... అడ్డుతగిలే వారూ లేరు.. కీలక నేతలకు భారీ ముడుపులు ముట్టచెబుతున్నాం.. ప్రత్యేకంగా గోతాలు ఖర్చు ఎందుకు దండగా... ఇదీ చీరాల నియోజకవర్గంలో రేషన్ మాఫియా తీరు. చీరాలలో రేషన్ మాఫియా బరితెగించింది. చీరాల నుంచి పర్చూరు వైపు అక్రమంగా తరలిస్తున్న 200 బస్తాల రేషన్ బియ్యాన్ని మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. ఈ బియ్యం మొత్తం సివిల్ సప్లయిస్ గోతాల్లోనే ఉండడం విస్తుగొలిపే అంశం. లబ్ధిదారులకు ఎంతోకొంత ముట్ట చెప్పి రేషన్ బియ్యాన్ని సేకరించేవారు. లేదంటే డీలర్ నుంచి సేకరించేవారు. కాకపోతే వాటిని ప్రభుత్వ గోతాల నుంచి వేరే సంచుల్లోకి మార్చే జాగ్రత్తలను గతంలో మాఫియా తీసుకునేది. ఇన్ని సార్లు గోతాలు మార్చడం ఎందుకు అనుకున్నారో ఏమో కానీ నేరుగా పౌరసరఫరాల శాఖ గోతాముల్లోనే బియ్యాన్ని అక్రమంగా తరలించే సాహసానికి అక్రమార్కులు పూనుకున్నారు. ఇలా దొరకడాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకోవాల్సిన వ్యవస్థలు పట్టుకున్నాం కేసు పెట్టాం అనే రీతిన మమ అనిపించడం విస్మయ పరుస్తోంది. ఆ బస్తాలు ఏ డీలర్ పాయింట్ నుంచి రవాణా అవుతున్నాయో తెలుసుకుని తీగలాగుదామన్న నిబద్ధత వ్యవస్థలకు లేదు.

నెల వారీ పాట పాడుకుని..

చీరాల నియోజకవర్గంలో నిన్నమొన్నటి వరకు ఓ వ్యక్తి చేతిలో రేషన్ మాఫియా నడిచేది. సదరు నేతకు అక్కడ నుంచి వస్తున్న వాటా సరిపోకపోవడంతో ఒంగోలు కేంద్రంగా దందా నిర్వహించే ఓ వ్యక్తికి చీరాల రేషన్ దందా బాధ్యతలు అప్పజెప్పారు. గతంలో ఇస్తున్న ముడుపులు కంటే భారీగా నెలానెలా అందించేలా ఒప్పందం కుదిరింది. నియోజకవర్గం మొత్తం గంపగుత్తగా రేషన్ బియ్యం దందా నడుపుకోవడానికి ఏకంగా అనధికారిక పాట పెట్టి మరీ ఓ రేటు ఫిక్స్ చేశారు. ఏకంగా నెలకు రూ.25 లక్షలు రేషన్ మాఫియా నుంచి కీలక నేతకు అందుతున్నట్లు సమాచారం. గత ప్రభుత్వంలో రేషన్ మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయడానికి ముగ్గురిపై పీడీ యాక్టు నమోదుకు అప్పటి జేసీ శ్రీనివాసులు రిఫర్ చేసిన సంగతి తెలిసిందే. ఆ ముగ్గురిలో ఇద్దరు చీరాలకు చెందిన వారే కావడం గమనార్హం. రాజకీయ పరమైన ఒత్తిళ్లతో ఆ దస్త్రాన్ని అప్పటి వైసీపీ ప్రభుత్వం అటకెక్కించిన సంగతి తెలిసిందే.







చెయ్యి మార్చగా రూ.6.8 కోట్లు మిగులు

గోలీల డొంక రోడ్డులో కొత్తపాలెం సమీపంలో కొన్న భూముల్లో మాత్రం వైసీపీ ముఖ్య నేతకు దగ్గరి అనుచరుడు, అర్థిక లావాదేవీలన్నీ దగ్గరుండి చూసుకున్న వ్యక్తి భూములు చేతులు మార్చి రోజుల వ్యధిలోనే రూ.6.8 కోట్లు వెనకేశారనేది ఆరోపణ. ఈయన తన బంధువుల పేరుపై 13 ఎకరాలను రూ.40 లక్షలు చొప్పున కొనుగోలు చేశాడు. ఆ తర్వాత వారానికే ఆ భూములను ప్రభుత్వానికి అమ్మేసి రూ.6.8 కోట్లు జేబులో వేసుకున్నాడని సమాచారం.

కుంభకోణంపై.. కనికరమా?

- విజిలెన్స్ విచారణపై అనుమానాలు
- జగనన్న కాలనీల పేరిట భూ కొనుగోల్‌మాల్
- తెనాలిలోనే రూ.100 కోట్లు చేతులు మారినట్లు ఆరోపణలు
- నాడు వైసీపీ నేతలకు మేలు చేసిన కొందరు అధికారులు
- వారిని కాపాడేందుకే విచారణలో తాత్సారమన్న ఆరోపణలు

నాడు పేదలకు సొంతిల్లని జగనన్న కాలనీల పేరిట భూ కుంభకోణానికి పాల్ప డిన వైసీపీ పెద్దల గుట్టురట్టు చేయాల్సిన అధికారులు కనికరం చూపుతున్నారు. ఒక్క తెనాలిలోనే రూ.100 కోట్లు కొట్టేసిన భూ కుంభ కోణం అంతుతేల్చేందుకు కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశం చింది. అయితే ఈ విచారణ జరుగుతున్న తీరు చూస్తే నాడు భూమాయలో భాగ స్వాములను కాపాడేటట్లుగా ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్విడ్‌ప్రోకో పద్ధతిలో అప్పటి ప్రభుత్వంలోని పెద్దలు భారీగానే ప్రజా ధనాన్ని దోచేశారని నాడు విమర్శలు వెల్లువెత్తాయి. అయితే నాటి ప్రభుత్వంలో అటు పాలకులు, ఇటు అధికా రులు దీని గురించి పట్టించుకోలేదు. రాష్ట్రవ్యాప్తంగా దోపిడీ జరిగినా, భారీ మొత్తం చేతులు మారింది మాత్రం తెనాలిలోనే అని కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. తెనాలిలో జరిగిన ఈ భూమాయ గుట్టును విజిలెన్స్ అధికారులు బహిర్గతం చేస్తే రాష్ట్రంలో మిగిలిన నియోజకవర్గాల్లో జరిగిన కుంభకోణాల్ని బట్టబయలు చేసేందుకు ఒక ఉదాహరణగా మారనుంది. అయితే ఇంతటి ప్రాధాన్యం ఉన్న కుంభకోణంపై విచారణ నెల నుంచి కొనసా...గుతూనే ఉంది. అధికారులు సంబంధిత రైతులను అడుగుతున్న ప్రశ్నలు, వారు చెబుతున్న సమాధానాలు చూస్తుం టే అసలు ఈ కుంభకోణం గుట్టు వీడుతుందా? దీని వెనకున్న పెద్దలకు శిక్షలు వేసి.. దోచుకున్న ప్రజాధనాన్ని కక్కిస్తారా అంటే అనుమానమే అని అర్థమవుతోంది.

ఎకరాకు.. రూ.52.51 లక్షలు స్వాహా

జగనన్న లేఅవుట్లు ఎక్కడనేది తెలుసుకున్న వైసీపీ నాయకులు కొందరు ముందుగానే రైతుల నుంచి ఎకరాకు రూ.35 లక్షల నుంచి రూ.40 లక్షలు చెల్లించి పొలాలు కొనుగోలు చేశారు. బినామీ పేర్లతో వాటిని ప్రభుత్వానికి రూ.92.51 లక్షలు అమ్మారు. వారం రోజుల్లోనే వీరికి ఎకరాకు రూ.52.51 లక్షలు అప్పనంగా వచ్చి చేరింది. భూమిని నమ్ముకుని ఉన్న రైతుకు రూ.40 లక్షలే అందితే, వారంలో చేతులు మార్చిన వైసీపీ దళారులకు ఎకరాకు రూ.52 లక్షలు దక్కింది.

తెనాలి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను నిజం చేస్తామంటూ కోట్లకు కోట్లు వైసీపీ పెద్దలు దోచేశారు. కాలనీలు కాదు.. ఊళ్ళు నిర్మిస్తున్నామని జేబులు నింపుకున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇంతగొప్ప కార్యక్రమం చేసిన ప్రభుత్వమే లేదని భూమాయ చేశారు. ఇది ఒక్క గుంటూరు జిల్లానే కాదు. రాష్ట్రం మొత్తం మీద (మిగతా 8వ పేజీలో)

ముఖ్య నేత పేరుతో వసూళ్లు..

బుర్రిపాలెం, నేలపాడు, అంగలకుదురు, గుడివాడ, కొలకలూరులలో కొన్న భూములకు ఎకరాకు రూ.10 నుంచి రూ.20 లక్షల వరకు వాటాల కింద వసూలు చేశారు. అదేమంటే ఈ డబ్బు ముఖ్య నేతకు ఇవ్వాలంటూ నిలబెట్టి వసూలు చేశారని రైతులు చెప్తున్నారు. ఒక ప్రవచన కర్త ఇంటిపేరుతో ఉన్న రైతు 6.5 ఎకరాలు ప్రభుత్వానికి ఇచ్చినందుకు అందిన మొత్తంలో నేతలకు వాటా రూపంలో ఇచ్చిన మొత్తమే రూ.1.8 కోట్లు అంటే, ఎంతటి స్థాయిలో డబ్బు చేతులు మారిందనేది అర్థమవుతుంది. ఓ లేఅవుట్‌లో 12 మంది 36 ఎకరాల భూమిని ఇచ్చినందుకు నేతలకు ఇచ్చిన వాటా రూ.8 కోట్లని సమాచారం. ఇలా మొత్తం 526 ఎకరాల్లో అందిన మొత్తం లెక్కిస్తే కళ్లు తిరగాల్సిందే.



నేలపాడులో ఆగిపోయిన పేదల ఇళ్లు



జిన్నింగ్.. దివాలా

నష్టాల ఊబిలో పరిశ్రమ


- 400 మిల్లుల్లో పనిచేస్తున్నవి 120 మాత్రమే
- రూ.30 కోట్ల ప్రోత్సాహకాల కోసం ఎదురుచూపు
- పన్నుల భారం తగ్గించాలని యజమానుల విజ్ఞప్తి

గుంటూరు సిటీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు కళకళాడిన జిన్నింగ్ పరిశ్రమ దివా లా దిశగా సాగుతోంది. ఉత్పత్తి వ్యయం పెరిగిపోవడం.. పత్తి విస్తీర్ణం పూర్తిగా పడిపోవడం.. పన్నులు మోత.. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహ కాలు లేకపోవడం.. తదితరాల నేపథ్యంలో పరి శ్రమను నష్టాల ఊబిలో పడేస్తోంది. ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా గతంలో 400 వరకు ఉన్న జిన్నింగ్ మిల్లులు ప్రస్తుతం కేవలం 120 మా త్రమే ఉనికిలో ఉన్నాయి. గుంటూరు రీజియన్‌లో 60 మిల్లులు, రాయలసీమ రీజియన్‌లో 60 మిల్లులు ఉండగా ప్రభుత్వం నుంచి సుమారు రూ.30 కోట్ల వరకు ప్రోత్సాహకాలు రావాల్సి ఉంది. గడిచిన ఐదేళ్ల కాలంలో వాటి విడుదల కోసం చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయని యజమానులను అసంతృప్తి చెందుతున్నారు. 2014 తర్వాత విభజిత రాష్ట్రంలో పత్తి విస్తీర్ణం పూర్తిగా పడిపోవడం పరిశ్రమకు కోలుకోలేని దెబ్బ తగులుతుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 10 లక్షల బేళ్లకు సరిపడా మాత్రమే పత్తి దిగుబడి వస్తుండగా, ఉనికిలో ఉన్న జిన్నింగ్ మిల్లులు 30 లక్షల బేళ్ల సామర్థ్యం కలిగి ఉన్నాయి. దీంతో ఖరీఫ్ సీజన్‌లో మాత్రమే మిల్లులు ఆడే పరిస్థితి నెలకొంది. మిగిలిన సంవత్సరమంతా మూతపడి ఉంటున్నా విద్యుత్ చార్జీలు, ఇతర పన్నుల భారం మాత్రం తప్పడం లేదు. మిగిలిన రాష్ట్రాల్లో పత్తి ఆధారిత పరిశ్రమలకు విద్యుత్ రాయితీలు పుష్కలంగా ఇస్తున్నా ఇక్కడ ఆ విధానం లేదు. హై టెన్షన్‌లో జిన్నింగ్ పరిశ్రమలను చూపడంతో కనీస డిమాండ్ చార్జీలు ఎక్కువగా పడుతున్నట్లు యజమాను లు చెబుతున్నారు. రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ ము గిసిన తర్వాత కొందరు జిన్నర్స్ ఇతర రాష్ట్రాల నుంచి పత్తిని కొనుగోలు చేయడం వల్ల రెండు రాష్ట్రాల్లో మార్కెటింగ్ సెస్సు చెల్లించాల్సి వస్తోంది. ఈ క్రమంలో ఇటీవల ఏపీ టీఎంసీ కన్సార్టియం రాష్ట్ర అధ్యక్షుడు ఇక్కుర్తి శివ ప్రసాద్, సీనియర్ నాయకుడు మన్నవ హరి గుంటూరులో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిసి సమస్యలను వివరించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రోత్సాహకాలు వెంటనే విడుదల చేయించాలని, బ్యాంకు వడ్డీ రేట్లలో కొంత వరకు తగ్గించాలని, జీఎస్టీ రాయితీ కల్పించాలని, మార్కె టింగ్ సెస్సు పూర్తిగా తగ్గించాలని, పత్తి విస్తీర్ణం పెంచేందుకు తెగుళ్లను తట్టుకునే మంచి వంగడాలను రైతులకు సరఫరా చేయాలని, రాష్ట్రంలో సీసీఐ పత్తి కొనుగోళ్లు పెంచాలని కోరారు.

పాలిసెట్.. పాట్లు

- ఫీజు చెల్లింపులో సాంకేతిక సమస్యలు
- ఉండీ ఉపయోగం లేని హెల్ప్‌లైన్ సెంటర్
- విద్యార్థుల ఇబ్బందులపై స్పందించని సిబ్బంది

గుంటూరు(విద్య), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పాలిసెట్ గడువు సమీపిస్తోంది. పరీక్షకు ఫీజు చెల్లించేందుకు విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాంకేతిక సమస్యల కారణంగా ఫీజు చెల్లింపులో అవాంతరాలు ఎదురవుతున్నాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. మంగళగిరిలోని సాంకేతిక శాఖ ప్రధాన కార్యాలయంలో సిబ్బంది విద్యార్థుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించడంలేదు. ఇక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినా దానివల్ల ఫలితం లేదని విద్యార్థులు వాపోతున్నారు. పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశం కోసం సాంకేతిక విద్యాశాఖ పాలిసెట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఏటా పాలిసెట్‌కు దాదాపు 20 వేల మందికి పైగా విద్యార్థులు హాజరవుతుంటారు. ఈ పరిస్థితుల్లో ఈ ఏడు పాలిసెట్‌కు ఈ నెల 15వ తేదీ చివరి తేదీగా గడువు ఇచ్చింది. గత నెల చివర్లో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు భారీ సంఖ్యలో పాలిసెట్ రాసేందుకు సన్నద్ధమయ్యారు. పదో తరగతి హాల్‌టికెట్ నంబర్ ద్వారా పాలిసెట్‌కు దరఖాస్తుకు సాంకేతికశాఖ అవకాశం ఇచ్చింది. అయితే హాల్ టికెట్లోని వివరాలతో పాటు అదనపు సమాచారం నింపి పరీక్ష ఫీజు చెల్లింపు కోసం విద్యార్థులు చేస్తున్న ప్రయత్నాలు విఫలమవుతున్నాయి. అనేకమంది విద్యార్థులు డెబిట్ కార్డును ఉపయోగించి ఫీజు చెల్లిస్తున్నారు. అయితే ఫీజు చెల్లింపు స్టేటస్‌లో ఫీజు చెల్లించలేదని లేదని ఆన్‌లైన్ ప్రత్యక్షమవుతుంది. మొత్తం ప్రక్రియ పూర్తి చేసి నగదు కట్ అయినా ఫీజులు జమ కాలేదంటూ సాంకేతిక విద్యా శాఖ నుంచి ఫోన్లకు వస్తున్న సమాచారంతో విద్యార్థులు బెంబేలెత్తుతున్నారు. దీంతో ఏమి చేయాలో పాలుపోక విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.



06 Apr 2025	
Debited	₹ 400.00 Dr
Description	POS:SBTETAP/ Mumbai/509611044766
05 Apr 2025	
Debited	₹ 400.00 Dr
Description	POS:SBTETAP/ Mumbai/509513972963

ఓ విద్యార్థి రెండుసార్లుగా చెల్లించిన పరీక్ష ఫీజు బ్యాంకు రశీదులు

స్పందించని హెల్ప్‌లైన్ సెంటర్లు

పాలిసెట్ విద్యార్థుల సమస్యలకు పరిష్కారం కోసం మంగళగిరిలో ప్రత్యేకంగా హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఇందులో ఇందులో డేటా ఎనాలసిస్ట్, సాంకేతిక విద్యాశాఖ సెక్రటరి కార్యాలయ సిబ్బంది, మరో రెండు హెల్ప్‌లైన్ సెంటర్ నెంబర్లు పొందుపరిచారు. అయితే ఈ నెంబర్లకు ఫోన్ చేసినా అక్కడి నుంచి స్పందన రావడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాంకేతిక సమస్యలను కార్యాలయ సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లాలన్నా ఫలితం ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ల్యాండ్‌లైన్ నెంబర్ కూడా పనిచేయడం లేదని ఫలితంగా సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థంకావడంలేదంటున్నారు. చివరకు మెయిల్ చేస్తే మీ డబ్బు 15 రోజుల్లో తిరిగి మీ ఖాతాకే వస్తుందన్న సమాచారం పంపి చేతులు దులుపుకుంటున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు.



మంగళగిరిలోని హెల్ప్‌లైన్ సెంటర్ ఫోన్ నెంబర్లు

మంగళగిరిలో.. అత్యాధునికంగా ఆస్పత్రి

- దేశానికి రోల్‌మోడల్‌గా వంద పడకలతో నిర్మాణం
- 13న శంకుస్థాపన చేయనున్న మంత్రి లోకేశ్

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అత్యాధునిక వైద్య సదుపాయాలతో.. కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా.. దేశానికే రోల్ మోడల్‌గా మంగళగిరిలో వంద పడకల ఆస్పత్రి నిర్మించనున్నారు. మంగళగిరి నియోజకవర్గ ప్రజల మూడు దశాబ్దాల కలకి ఈ నెల 13న మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేయనున్నారు. వంద పడకల ఆస్పత్రిని దేశంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని మంత్రి నారా లోకేశ్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఏడాదిలోగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు. యువగళం పాదయాత్ర సందర్భంగా మంగళగిరి ప్రభుత్వ ఆస్పత్రిని వంద పడకల ఏరియా ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు. గతేడాది అక్టోబరు 23న జరిగిన మంత్రివర్గ సమావేశంలో మంత్రి లోకేశ్ ప్రతిపాదనను మంత్రివర్గం ఆమోదించింది. దీంతో 1986లో ఏర్పాటు చేసిన ఆస్పత్రి భవనం శిథిలం కావడంతో వైద్యశాలను చినకాకాని వద్దకు మార్చి, కేన్సర్ ఆస్పత్రి స్థలాన్ని వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి కేటాయించారు. 7.35 ఎకరాల్లో లక్షా 15 వేల చదరపు అడుగుల్లో సువిశాలంగా ఆస్పత్రి భవనాన్ని రూ.52.20 కోట్లతో నిర్మించనున్నారు. ఆస్పత్రిలో మెడికల్, సర్జికల్, ఆర్థో, గైనిక్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్ విభాగాలు, మూడు ఆపరేషన్ థియేటర్లు, డయాలసిస్ సెంటరు, తలసేమియా వార్డు, డీ అడిక్షన్ ఓపీ సెంటరు అందుబాటులోకి తేనున్నారు.



వంద పడకల ఆస్పత్రి తాలూకూ నమూనా చిత్రం

ఫైనాన్స్ కంపెనీ ఆగడాలతో మహిళ ఆత్మహత్య

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఫైనాన్స్ కంపెనీ ఆగడాలను రుణ గ్రహీతలు తట్టుకోలేకపోతున్నారు. వాయిదాలు చెల్లించలేదని రుణగ్రహీతలపై దౌర్జన్యాలకు పాల్పడటంతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని వెల్లటూరుకు చెందిన బాణావత్ పార్వతి (45) గోవింద్ దంపతులు రెండేళ్ల క్రితం ఫైవ్‌స్టార్ ఫైనాన్స్ కంపెనీలో తమ ఇంటిని తనఖా పెట్టి రూ.3 లక్షలు రుణం తీసుకున్నారు. ఇటీవల ఆర్థిక ఇబ్బందుల కారణంగా వాయిదాలు సక్రమంగా చెల్లించకపోవడంతో కంపెనీ ఏజెంట్లు పార్వతి ఇంటిలోని సామాన్లు బయటకు విసిరేయడంతో పాటు ఇంటికి తాళం వేశారు. స్థానికులు, బంధువులు ఏజెంట్లను బతిమలాడి నచ్చజెప్పడంతో మరో దఫా వాయిదాలు సక్రమంగా చెల్లించకపోతే ఊరుకోమని హెచ్చరించి ఇంటికి వేసిన తాళాన్ని ఇచ్చి వెళ్లారు. ఈ సంఘటనే మనస్థాపానికి గురైన పార్వతి మంగళవారం సాయంత్రం ఇంటిలో ఉరి వేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కొన ఊపిరితో ఉన్న ఆమెను తెనాలి వైద్యశాలకు అక్కడ నుండి గుంటూరు వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. కుమారుడు శివశంకర్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ శివయ్య ఫైనాన్స్ కంపెనీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిన్నెల్లి సోదరుడు మాకు అన్యాయం చేశాడు

ఎస్పీ ఎదుట అనాథ వృద్ధ దంపతుల ఆవేదన

మాచర్ల రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి తమ కేసు పరిష్కారం కాకుండా అడ్డుకొని అన్యాయం చేశారని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఎదుట అనాథ వృద్ధ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జరిగిన అన్యాయంపై గతంలో వారు ఫిర్యాదు చేశారు. దానిపై విచారణకు ఎస్పీ గురువారం విజయపురి సౌత్ వచ్చారు. మండలంలోని విజయపురిసౌత్‌లో నివాసం ఉంటున్న ఆరికట్ల బ్రహ్మారెడ్డి, విజయలక్ష్మి వృద్ధ దంపతులు 8.5 ఎకరాల పొలంతో పాటు ఆస్తులను మొత్తం అమ్మి తమ కొడుకు అంజిరెడ్డిని ఉన్నత చదువులు చదివించడంతో, అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడ్డారని చెప్పారు. అయితే తాము అనారోగ్యంతో బాధపడుతున్నా, తమ కొడుకు అంజిరెడ్డి తమను పట్టించుకోవడం లేదన్నారు. తమ పరిస్థితి మరింత దుర్భరంగా మారడంతో, ఆత్మహత్యాయత్నానికి కూడా యత్నించామని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మాచర్ల పోలీసులకు తమ కొడుకుపై ఫిర్యాదు చేస్తే పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, తమ కుమారునికి మద్దతుగా నిలిచి కేసు పరిష్కారం కాకుండా చేశాడన్నారు. ఎన్నిసార్లు ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. దిక్కులేక కోర్టులో కేసు వేశామని, నెలకు రూ. 10 వేలు భరణం ఇవ్వాలని కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. కోర్టు తీర్పును కూడా తమ అంజిరెడ్డి ఖాతరు చేయలేదని ఎస్పీకి తెలిపారు. న్యాయం తప్పక చేస్తామని ఎస్పీ శ్రీనివాసరావు వృద్ధ దంపతులకు హామీ ఇచ్చారు. ఎస్పీ వెంట మాచర్ల తహసీల్దార్ కిరణ్‌కుమార్, మాచర్ల రూరల్ సీఐ నఫీజ్‌బాషా, విజయపురిసౌత్ ఎస్ఐ మహ్మద్ షఫి ఉన్నారు.

మిర్చియార్డు మాజీ సెక్రటరీపై అభియోగాల నమోదు

వాటిపై విచారణ జరపాలని ప్రభుత్వ నిర్ణయం ● ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రస్తావించిన వ్యవసాయ సహకార శాఖ



గుంటూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డు(గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ) మాజీ సెక్రెటరీ వీ ఆంజనేయులుపై విచారణ జరపాలని రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ నిర్ణయించింది. మంత్రి కే అచ్చెన్నాయుడు మార్కెటింగ్ శాఖ అధికారులకు రాసిన లేఖ విషయంలో గోప్యత పాటించకుండా దానిని హైకోర్టులో దాఖలు చేసిన రిట్ పిటీషన్‌లో జత చేయడమే ఇందుకు కారణం. ఇదే విషయాన్ని ఆంధ్రజ్యోతి ఈ ఏడాది జనవరి 21వ తేదీన 'మంత్రి లేఖ బట్టబయలు' అనే శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. వ్యవసాయ శాఖ ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రెటరీ బుడితి రాజశేఖర్ గురువారం జారీ చేసిన ఉత్తర్వులు జీవో ఆర్ టీ నంబరు. 189లో ఆంధ్రజ్యోతి కథనాన్ని ఉటంకిస్తూ విచారణకు ఆదేశించారు.

మూడు నెలల పాటు మిర్చియార్డుకు ఇన్‌చార్జ్ సెక్రెటరీగా వీ ఆంజనేయులు వ్యవహరించారు. రాజమహేంద్రవరం ఏఎంసీ కార్యదర్శిగా ఉన్న ఆయన్ని ఇన్‌చార్జ్ ఏర్పాట్లపై గుంటూరు మిర్చియార్డుకు నియమించింది. అయితే ఆయన ఛార్జ్ తీసుకొన్న నెలన్నర వ్యవధిలోనే మరో అధికారిని పోస్టింగ్ చేసేందుకు మార్కెటింగ్ శాఖలో ఫైలు నడిచింది. ప్రస్తుత కార్యదర్శి ఏ చంద్రిక డిప్యూటేషన్ కోసం దరఖాస్తు చేసుకోగా అందుకు మంత్రి సమ్మతిస్తూ మార్కెటింగ్ శాఖకు పంపించారు. దీనికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలను మార్కెటింగ్ శాఖ నుంచి సేకరించిన అప్పటి ఇన్‌చార్జ్ సెక్రెటరీ ఆంజనేయులు హైకోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేశారు. దాంతో పాటు మంత్రి లేఖని కూడా జోడించారు. ఈ విషయం బహిర్గతం కావడంతో ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రచురించింది.

అధికారిక ఉత్తర్వుల విషయంలో గోప్యత పాటించకపోవడంతో ఆంజనేయులుపై ప్రభుత్వం అభియోగాలను నమోదు చేసింది. వాటిపై విచారణ నిర్వహించేందుకు నిర్ణయం తీసుకొన్నది. ఈ నేపథ్యంలో ఆయనపై నమోదు చేసిన అభియోగాలకు సంబంధించి 15 రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. లిఖిత పూర్వకంగా వివరణ ఇవ్వకపోతే చర్యలు తప్పవని హెచ్చరించింది. అలానే ఎంక్వయిరీ అధికారులపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు తీసుకురాకూడదని స్పష్టం చేసింది.

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

36 ద్విచక్ర వాహనాలు స్వాధీనం... అభినందించిన ఎస్పీ తుషార్ డూడీ



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు బాపట్ల డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు తెలిపారు. గురువారం భట్టిప్రోలు పోలీసు స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొంత కాలంగా బాపట్ల, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు తదితర జిల్లాలతో పాటు తెలంగాణాలో కూడా ద్విచక్ర వాహనాలను చోరీకి పాల్పడుతున్న ముగ్గురు నేరస్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరిలో ప్రధాన ముద్దాయి తెనాలికి చెందిన పుట్టా శివశంకర్ ఆటోలు నడుపుకుని జీవనం సాగించేవాడని, చెడు వ్యసనాలకు బానిపై దొంగతనాలకు అలవాటు పడి రైల్వే స్టేషన్, బస్టాండ్, సినిమా హాలు వద్ద పార్కు చేసిన ద్విచక్ర వాహనాలను నకిలీ తాళాలతో చోరీకి పాల్పడుతుంటాడన్నారు. అతనికి కోడి పందాల వద్ద చెరుకుపల్లి మండలం కనగాలకు చెందిన పీటా నాగబాబు, ఐలవరంకు చెందిన దీపాల తేజ్‌వెంకటనాగసాయి విజయ్‌కుమార్ పరిచయమయ్యారన్నారు. శివశంకర్ పలు చోట్ల చోరీ చేసిన ద్విచక్ర వాహనాలను వీరి వద్ద భద్రపరుస్తూ ఉంటాడన్నారు. శివశంకర్‌పై వివిధ పోలీస్ స్టేషన్‌లలో దొంగతనం కేసులు నమోదు అయి వున్నాయన్నారు. నాగబాబుపై చెరుకుపల్లి పోలీస్ స్టేషన్‌ట చీటింగ్ కేసు ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. భట్టిప్రోలులోని హోసన్న మందిరం వద్ద ఓ గృహంలో ఉన్న మోటారు సైకిల్ చోరీ జరిగింది. బాధితుడు ఫిర్యాదు మేరకు, ఎస్పీ ఆదేశాలతో, డీఎస్పీ ఆధ్వర్యంలో వేమూరు సీఐ పసుపులేటి వీరాంజనేయులు, రేపల్లె రూరల్ సీఐ సురేష్‌బాబు సారథ్యంలో భట్టిప్రోలు, చెరుకుపల్లి ఎస్ఐలు శివయ్య, అనీల్‌కుమార్ ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను అత్యంత చాకచక్యంగా అరెస్టు చేసి వారి వద్ద రూ.25లక్షలు విలువ కలిగిన 36 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసిన డీఎస్పీ శ్రీనివాసరావుతో పాటు వేమూరు, రేపల్లె రూరల్ సీఐలను భట్టిప్రోలు, చెరుకుపల్లి ఎస్ఐలు, సిబ్బందిని ఎస్పీ తూషార్‌డూడీ ప్రత్యేకంగా అభినందించారని ఆయన వివరించారు.

తృణధాన్యాల ఉత్పత్తులలోకి తెనాలి డబుల్ హార్స్ గ్రూప్



తృణధాన్యాల ఉత్పత్తుల ఆవిష్కరణలో డబుల్ హార్స్ ఎండీ శ్యాంప్రసాద్, డాక్టర్ సంగీతారెడ్డి, యాంకర్ సుమ, నిర్మాత దిల్‌రాజు తదితరులు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పప్పుల విక్రయంలో ప్రముఖ స్థానం పొందిన డబుల్ హార్స్ సంస్థ తాజాగ తృణ ధాన్యాల ఉత్పత్తులలోకి ప్రవేశించిందని సంస్థ ఎండీ మునగాల శ్యాంప్రసాద్ తెలిపారు. మిల్లెట్ మార్వెల్స్ పేరుతో తయారు చేసిన ఉత్పత్తులను గురువారం హైదరాబాద్‌లో అపోలో హస్పటల్ జేఎండీ డాక్టర్ సంగీతారెడ్డి చేతుల మీదుగా మార్కెట్‌లోకి విడుదల చేసినట్లు తెలిపారు.

హెల్త్ మిక్స్ డయాబెటిక్ ఫ్రెండ్లీ మిక్స్, సెమోలినా, పాస్తా, నట్స్ డ్రైడ్ ఫ్రూట్స్ వంటి ఉత్పత్తులను క్రమంగా తెనాలి డబుల్ హార్స్ మార్కెట్‌లోకి తెస్తుందని శ్యాంప్రసాద్ చెప్పారు. ఆర్గానిక్ ఉత్పత్తులను కూడా రానున్న రోజుల్లో విడుదల చేసేందుకు సిద్ధం అవుతున్నామని, తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర దేశాలకు కూడా మిల్లెట్ మార్వెల్స్ అందిస్తామన్నారు. ఆ తరువాత పాన్ ఇండియా మార్కెట్‌లో విస్తరిస్తామని రానున్న మూడేళ్లలో ఐదు శాతం ఆదాయం మిల్లెట్ మార్వెల్స్ ద్వారా సమకూరేందుకు లక్ష్యం పెట్టుకున్నామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సంస్థ సేల్స్ టర్నోవర్ రూ.535కోట్లకు చేరిందని రానున్న మూడేళ్లలో దీనిని నాలుగు అంకెలకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 12 దేశాలలో తమ బ్రాండెడ్ కమోడీటీస్ అడుగు పెట్టాయని, దేశంలోని 15 రాష్ట్రాలలో ఖాతాదారులకు చేరువ అయ్యామన్నారు. జనరల్ ట్రేడ్, మోడ్రన్ ట్రేడ్, ఈ-కామర్స్, క్విక్ కామర్స్ ద్వారా వినియోగదారులకు ఉత్పత్తులు అందిస్తున్నామన్నారు. బ్రాండెడ్ అవుట్‌లెట్లు ఏర్పాటు చేస్తూ వినియోగదారులకు చేరువ అవుతామని చెప్పారు. కార్యక్రమంలో యాంకర్ సుమ, నిర్మాత దిల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కొడుకుని రక్షించబోయి.. తండ్రి మృతి

మాచవరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : కళ్లెదుటే తన కుమారుడు నీటి కుంటలో మునిగి పోతూ ఉంటే ఏ తండ్రి అయినా చూస్తూ ఊరుకుంటాడా?...తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా కొడుకుని రక్షించి చివరకు తన ప్రాణాలను తీసుకున్న విషాద సంఘటన మండలంలోని శ్రీ రుక్మిణీపురం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మేకలను మేపుకొనేందుకు దేశబోయిన వెంకటేశ్వర్లు(40) అతని కుమారుడు మణికంఠ, మేనల్లుడు వెంకటేశ్వర్లు ముగ్గురు కలసి వెళ్ళారు. పగలంతా మేకలను మేపుకొని తిరిగి ఇంటికి వస్తున్న తరుణంలో మేకలకు నీరు తాగించేందుకు కృష్ణా నది ఒడ్డు సమీపంలోకి వెళ్ళారు. శ్రీ రుక్మిణీపురం, నాగేశ్వరపురం తండా గ్రామాల సమీపంలో ఉన్న పిల్లేరు వాగు కృష్ణా నదిలో కలిసే ప్రాంతంలో మేకలకు నీరు తాగించేందుకు పూనుకున్నారు. ఆ సమయంలో మేకలు నీటిలో కొట్టుకు పోతాయనే ఉద్దేశంతో ముందుగా వెంకటేశ్వర్లు కుమారుడు మణికంఠ నీటిలోకి దిగాడు. అదే సమయంలో కింద పూడు ఉండటంతో మునిగి పోతున్నాడు. ఇది గమనించిన తండ్రి వెంకటేశ్వర్లు కొడుకును రక్షించేందుకు తాను నీటిలోకి దిగి కొడుకును పైకి లాగి తాను పూడిలో కూరుకు పోతున్నాడు. ఇది గమనించిన మేనల్లుడు వెంకటేశ్వర్లు మేనమామను రక్షించేందుకు తన ఒంటి మీద ఉన్న లుంగీని తీసివేసి వెంకటేశ్వర్లుకు అందించే ప్రయత్నం చేసినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. వెంకటేశ్వర్లు పూడిలో కూరుకు పోయి చని పోయాడు. ఇరుగురు పొరుగు వారి ద్వారా సమాచారాన్ని బంధువులకు చేర వేశారు. బంధువులు మాచవరం పోలీసులకు సమాచారాన్ని ఇవ్వగా సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మత్స్య కారుల ద్వారా మృత దేహాన్ని వెలికి తీశారు. వెంకటేశ్వర్లు తల్లి నాగమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల వైద్యశాలకు తరలించారు.

అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి

● లోకసభ ప్యానల్ స్పీకర్, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్



మానిటరింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న లోకసభ ప్యానల్ స్పీకర్, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయటానికి చర్యలు తీసుకోవాలని లోకసభ ప్యానల్ స్పీకర్, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో డిస్ట్రిక్ డెవలప్‌మెంట్ కోఆర్డినేషన్ మానిటరింగ్ కమిటీ సమావేశం ఎంపీ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో కేంద్రప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులపై ఆలసత్వం లేకుండా పూర్తి చేయాలని చెప్పారు. జిల్లాను అభివృద్ధి చేయటానికి అవసరమైన ప్రణాళికలు తయారు చేయాలని తెలిపారు. జిల్లాలో కేంద్రప్రభుత్వ నిధులతో అమలు చేస్తున్న పథకాలన్నింటిని ప్రజలకు చేరువచేయాలని చెప్పారు. రాష్ట్రప్రజల సంక్షేమం కోసం 10రకాల కార్యక్రమాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమలు చేస్తున్నారన్నారు. పేదరికం నిర్మూలించటానికి ప్రత్యేక చర్యలు చేపట్టారన్నారు. జిల్లాలో పూర్తిగా వెనుకబడిన మండలాలను గుర్తించి అక్కడ స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్‌లు ఏర్పాటు చేయటానికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కేంద్రప్రభుత్వ నిధులతో ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. వేసవి సీజన్ దృష్ట్యా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా మేనెలలో మరొకసారి తాగునీటి చెరువులను నింపుకోవాలన్నారు. జిల్లాలో అమృత్‌ధారా మెగాప్రాజెక్టుకు రూ.3,500 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారన్నారు.

● కలెక్టర్ జె.వెంకటమురళి మాట్లాడుతూ జిల్లాలో కేంద్రప్రభుత్వ నిధులతో మంజూరైన అభివృద్ధి పనులను పారదర్శకంగా అమలు చేస్తున్నామని తెలిపారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా రక్షిత మంచినీటి పథకాలను కృష్ణాజలాలు, సాగర్‌కాల్వల ద్వారా నింపినట్లు చెప్పారు. బాపట్లలో జరిగిన మెగాపేరెంట్స్ అండ్ టీచర్స్‌మీట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు రూ.1.48కోట్ల తో మున్సిపల్ హైస్కూల్ భవననిర్మాణం పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే నరేంద్రవర్మ, జేసీ ప్రఖర్‌జైన్, ప్రకాశం, గుంటూరు జడ్పీ సీఈవోలు చిరంజీవి, బోసు, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, ముఖ్యప్రణాళికాధికారి శ్రీనివాసరావు, డీపీవో ప్రభాకర్, గృహనిర్మాణశాఖ పీడీ వై వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు, డ్వామా పీడీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. గురువారం త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక చెంచుపేట డొంక రోడ్డు వద్ద రేషన్ బియ్యాన్ని వాహనంలో తరలిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు దాడులు నిర్వంచారు. ఓ వాహనంలో 50 కేజీల చొప్పున 14 బస్తాలు ఉన్నట్టు గుర్తించారు. వాహనాన్ని బియ్యం బస్తాలను స్వాధీనపరుచుకొని స్టేషన్‌కు తరలించారు. రెవెన్యూ అధికారులకు సమాచారమిచ్చి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. అదేవిధంగా సుల్తానాబాదు కుమార్ పంప్స్ కాలనీ వద్ద 50బస్తాల రేషన్ బియ్యంను పట్టుకున్నట్లు త్రీటౌన్ పోలీసులు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

వైసీపీ నాయకుల్లో తగ్గని అహంకారం

మాజీ ఎంపీ గోరంట్ల వ్యవహారంపై ఎమ్మెల్యే నరేంద్ర

పొన్నూరు టౌన్ ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): చేసిన అరాచక పాలన దుర్మార్గ నిర్ణయాలకు అధికారం కోల్పోయిన వైసీపీ నాయకులలో అహకారం మాత్రం తగ్గలేదని ఎమ్మెల్యే , సంగం డెయి రీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ గురువారం అన్నారు. మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ వ్యవహారమే వైసీపీ నాయకుల అహంకార వైఖరికి నిదర్శనమన్నారు. చేబ్రోలు కిరణ్ అనే సోషల్ మీడియా కార్యకర్త అరెస్టు వ్యవహారంలో గోరంట్ల మాధవ్ పోలీసుల సమాచారంతోనే సంఘటన స్థలానికి చేరుకుని దాడికి పాల్పడ్డాడని అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులలో ఉన్న వైసీపీ సానుభూతి పరుల సమాచారంతోనే గోరంట్ల మాధవ్ కిరణ్‌ను తరలిస్తున్న వాహనాలను అనుసరిస్తూ వస్తూ పోలీసుల సమక్షంలోనే దాడి చేసే దుస్సాహసానికి పాల్పడ్డాడని ఎమ్మెల్యే ఆరోపించారు. చేబ్రోలు కిరణ్ వైసీపీ నాయకుల కుటుంబ సభ్యుల పై అనుచిత వ్యాఖ్యలు చేశారని కూటమి ప్రభుత్వమే ముందుగా స్పందించి చట్ట పరంగా కిరణ్‌ను శిక్షించేందుకు అరెస్టు చేసి చిత్తశుద్ధిని నిరూపించుకుందన్నారు. మాధవ్ వ్యవహారం పై పోలీసుల సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. లేదంటే కస్టడీలో ఉన్న కిరణ్ పై జరిగిన దాడి పోలీసుల వైఫల్యమే అవుతుందన్నారు.

రేపటి నుంచి కొండవీటి కళాపరిషత్ నాటికల పోటీలు

యడ్లపాడు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : రెండున్నర దశాబ్దాలకు పైగా నాటిక పోటీలు నిర్వహిస్తున్న కొండవీడు కళాపరిషత్. ఈ నెల 12 నుంచి మూడు రోజులపాటు 26వ జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలను నిర్వహిస్తున్నారు. పల్నాడు జిల్లా లింగారావుపాలెం గ్రామంలో గల జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలోని పోసాని సుబ్బారావుచౌదరి స్మారక కళావేదిక పై 12,13,14 తేదీలలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు మూడు నాటికల చొప్పున మొత్తం 9 నాటికలు ప్రదర్శితం కానున్నాయి. ఆయా పోటీల్లో ఉత్తమంగా నిలిచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ ప్రదర్శనలకు నగదు బహుమతులు, కళాకారులకు జ్ఞాపికలు, ప్రతి నాటికకు ప్రదర్శన పారితోషికం ఇస్తున్నామని వివరించారు. అలాగే ఉత్తమ రచయిత, ఉత్తమ దర్శకుడికి ప్రత్యేక నగదు బహుమతులు, షీల్డులు ఇవ్వనున్నట్లు పరిషత్ అధ్యక్షులు కట్టా శ్రీహరిరావు, కార్యదర్శి మండెపూడి శ్రీనివాసరావ, ఉపాధ్యక్షులు తోకల సాంబశివరావు, సభ్యులు తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 515.30 అడుగులు ఉంది. ఇది 140.84 టీఎంసీలకు సమానం. ఎడమ కాలువ ద్వారా 841 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 2441 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

డీఎస్సీ కి ఆన్ లైన్ లో ఉచిత శిక్షణ

గుంటూరు (విద్య) ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ పరీక్షకు ఎస్సీ, ఎస్టీ, బీసీ , ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఆన్లైన్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ అధికారి కే మయూరి గురువారం ఒక ప్రకటన లో తెలిపారు. అభ్యర్థులు టెట్ పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలని వార్షిక ఆదాయం లక్షలోపు ఉండాలని సూచించారు. ఆసక్తి అర్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తుతో పాటు పదవ తరగతి మార్కుల జాబితా, టీటీసీ లేదా బీఈడీ పాస్ అయినట్లు సర్టిఫికెట్లు, తల్లిదండ్రుల వార్షిక ఆదాయ ధ్రువీకరణ పత్రం,రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, ఆధార్ తదితర వివరాలను గుంటూరు రాజా గారి తోటలోని బీసీ స్టడీ సర్కిల్ కు పంపాలని సూచించారు వివరాలు కోసం 0863-2358071 నంబర్ లో సంప్రదించాలని సూచించారు.

ఆర్మీలో ఉద్యోగాలకు రిజిస్ట్రేషన్ తేదీ పొడిగింపు

● ఈ నెల 25వ తేదీ వరకు అవకాశం

గుంటూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): భారత సైన్యంలో నియామకాలకు రిజిస్ట్రేషన్ గడవు తేదీని పొడిగించినట్లు ఆ సంస్థ గుంటూరు బ్రాంచ్ రిక్రూటింగ్ కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొనేందుకు అవకాశం ఉన్నదని పేర్కొన్నది. ఆన్‌లైన్ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ జూన్ నెలలో తెలుగుతో సహా 13 వేర్వేరు భాషలలో నిర్వహించడం జరుగుతుంది. గుంటూరు, కర్నూలు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, అనంతపురం, వైఎస్ఆర్ కడప, ప్రకాశం, చిత్తూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, తిరుపతి, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన ఆసక్తిగల అభ్యర్థులు అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్ అసిస్టెంట్, క్లర్కు/స్టోర్‌కీపర్ టెక్నికల్, ట్రేడ్స్‌మెన్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలియపరిచింది. నియామక ప్రక్రియ పూర్తిగా ఆటోమేటెడ్, న్యాయపరంగా, పారదర్శకంగా ఉంటుందని తెలిపింది. అభ్యర్థులు ఎవ్వరూ దళారీలు, ఏజంట్లు, ఏజెన్సీల ప్రలోభాలకు గురికావొద్దని సూచించింది.

జూన్ నెలాఖరు వరకు తిరుపతి, షిర్డి ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో తిరుపతి, షిర్డి సందర్శనకు వెళ్లే యాత్రీకుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే జూన్ నెలాఖరు వరకు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ఆ సంస్థ సీపీఆర్‌వో ఏ శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు 07637 తిరుపతి - సాయినగర్ షిర్డి ప్రత్యేక రైలు ఈ నెల 13 నుంచి జూన్ 29వ తేదీ వరకు ప్రతీ ఆదివారం బయలుదేరి చీరాల, బాపట్ల, తెనాలి, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి మీదగా మరుసటి రోజు సాయినగర్ షిర్డి చేరుకొంటుంది. నంబరు. 07638 సాయినగర్ షిర్డి - తిరుపతి ప్రత్యేక రైలు ఈ నెల 14 నుంచి జూన్ 30వ తేదీ వరకు ప్రతీ సోమవారం బయలుదేరి మంగళవారం తిరుపతికి చేరుకొంటుంది.

చర్లపల్లి - శ్రీకాకుళం రోడ్డు - చర్లపల్లి ప్రత్యేక రైళ్లు

నంబరు. 07025 చర్లపల్లి - శ్రీకాకుళం రోడ్డు ప్రత్యేక రైలు ఈ నెల 11 నుంచి జూన్ 27వ తేదీ వరకు ప్రతీ శుక్రవారం బయలుదేరి నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు శ్రీకాకుళం రోడ్డుకు చేరుకొంటుంది. నంబరు. 07026 శ్రీకాకుళం రోడ్డు - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 12 నుంచి జూన్ 28వ తేదీ వరకు ప్రతీ శనివారం బయలుదేరి మరుసటి రోజు చర్లపల్లి చేరుకొంటుందన్నారు.

వీఆర్‌కు గురజాల డీఎస్పీ జగదీష్

గురజాలటౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గురజాల డీఎస్పీ జగదీష్ వీఆర్‌కు గురువారం బదిలీ అయ్యారు. ఆయన్ను ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. కాగా సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు ఇన్‌చార్జిగా వ్యవహరించనున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

1,22,136 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,25,167 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,22,136 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 65,764 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.


వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13200
నంబరు. 5	10000	13300
273	10000	12600
341	10500	13600
4884	10000	11500
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
షార్క్-1	10000	12400
బ్యాడిగి 355	10000	13200
సింజెంటా బ్యాడిగి 5531	--	--
దేవనూరు డీలక్స్	10000	12400
ఆర్మూరు	9800	11000
తాలుకాయలు	4500	6500

శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోకరాజుపాలెం శ్రీనివాసపురంలో ఉన్న శ్రీలక్ష్మీపద్మావతి సమేత కల్యాణ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం నందు ఈ నెల 12న శనివారం వార్షిక శ్రీనివాసకల్యాణ మహోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం ఉదయం 7గంటలు నుంచి హోమాత్మక అష్టోత్తర శతకలశం స్నపన కార్యక్రమం జరుగుతుందని ఆలయ అర్చకులు బృందావనం గోపిచంద్ తెలిపారు. శనివారం శ్రీనివాస కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తామని ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

హరిహరమూర్తిగా అనంత భోగేశ్వరస్వామి



కొల్లూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): హరిహర మూర్తి అలంకారంలో అనంత భోగేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం గంగా పార్వతీ సమేత అనంత భోగేశ్వరస్వామి ఆలయంలో స్వామికి భక్తులు విశేష అలంకారం చేశారు. ఓ వైపు శివుడు, మరో వైపు విష్ణువు కలగలిసిన హరిహరమూర్తి అలంకారం భక్తులను విశేషంగా ఆకర్షించింది. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

14న మెగా టెన్నిస్ బాల్ టోర్నమెంట్

వేమూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెరవలిలో ఈ నెల 14వ తేదీ నుంచి 10వ మెగా టెన్నిస్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో టోర్నమెంట్ జరుగుతుందన్నారు. 12వ తేదీ సాయంత్రం 6 గంటలకు డ్రా తీయబడుతుందన్నారు. ఎంట్రీ ఫీజు రూ.1000 చెల్లించాలని తెలిపారు. వివరాలకు ఆనంద్ 9848627275, హరికృష్ణ 9398491055ను సంప్రదించాలన్నారు.

13న గోవాడలో కంటి పరీక్షలు

అమృతలూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 13వ తేదీ ఆదివారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మండలపరిధిలోని గోవాడ ఎన్టీఆర్ కమ్యూనిటీ భవనం నందు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు పావులూరి శివరామకృష్ణయ్య జ్ఞాపకార్థం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరంలో కంటి సమస్యలపై వైద్య పరీక్షలు జరుపుతారన్నారు.

నేడు వంతెనకు శంకుస్థాపన

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అలకాపురం గ్రామపంచాయతీలోని సత్యనారాయణపురం ఎస్టీకాలనీ వద్ద తుంగభద్రకాల్వపై నూతనంగా నిర్మించబోయే వంతెనకు ఎమ్మెల్యే నరేంద్రవర్మ, బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణప్రసాద్‌లు శంకుస్థాపం చేస్తారని పిట్టలవానిపాలెం అధ్యక్షుడు ఎండీ అప్జల్, అలకాపురం సర్పంచ్ గంగరాజులు తెలిపారు.

అమరవీరులకు శ్రద్ధాంజలి

కొల్లూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : లంక భూముల పోరాటంలో అశువులు బాసిన అమరవీరులకు సీపీఎం నాయకులు గురువారం నివాళులర్పించారు. మండల పరిధిలోని గాజుల్లంకలో 10-04-1947లో చల్లపల్లి జమీందారుకి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న వారిపై పోలీసులు కాల్పులు జరుపగా నలుగురు కాల్పులలో మృతి చెందారు. వారి జ్ఞాపకార్థం అక్కడ అమరవీరుల స్థూపం నిర్మించారు. స్థూపం వద్ద పార్టీ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి వేములపల్లి వెంకట్రామయ్య, పంతగాని నాగమల్లేశ్వరరావు, బొనిగల సుబ్బారావు, అగ్గిరామయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కర్లపాలెం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రతినెల పదిమందికి చేయూతనిద్దాం - చైతన్య పరుద్దాం కార్యక్రమాన్ని కరుణజీవన్ మినిస్ట్రీస్ సంస్థ వారు గురువారం నల్లమోతువారిపాలెంలో చేయూత కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన రాచూరి సాంబయ్య కుటుంబా నికి బియ్యం, రెండు జతల బట్టలు, వంట సామగ్రి, నిత్యావసర సరుకులు అందించారు. అనంతరం అక్కడ ఉన్న గిరిజన వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మినిస్ట్రీట్ అధ్యక్షుడు పోలీసురావు, సభ్యులు, స్థానిక ఉపాధ్యాయుడు విజయకుమార్ తదితరులు ఉన్నారు.

ఫైనాన్స్ కంపెనీల ఆగడాలు అరికట్టాలి : సీపీఎం

బాపట్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పేదల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఫైనాన్స్ కంపెనీల ఆగడాలు అరికట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య డిమాండ్ చేశారు. ఈవిషయమై గురువారం పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలు రిజర్వుబ్యాంకు నిబంధనలకు విరుద్ధంగా అప్పులిచ్చి వారి ప్రాణాలు బలిగొంటున్నారని దుయ్యబట్టారు. జిల్లాలోని భట్టిప్రోలు మండలం వెల్లటూరులోని చెన్నకేశవ నగర్ కాలనీకి చెందిన బాణావత్ పార్వతి తీసుకున్న అప్పు కిస్తీలు కట్టలేదన్న కారణంతో నిబంధనలకు విరుద్ధంగా తనఖా పెట్టిన ఇంటికి తాళం వేయటంతో ఆమె మనస్తాపం చెంది మృతి చెందిందన్నారు. ఈ విధంగా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఫైనాన్స్ కంపెనీలపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో బి.కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

రంగు మారుతున్న తాగునీరు..

- ఆందోళనలో పట్టణ ప్రజలు
- మున్సిపల్ అధికారుల తీరుపై విమర్శలు

బాపట్ల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీరు రోజుకోరకంగా వస్తున్నాయి. ఒక్కోరోజు ఒక్కో రంగులో నీరు వస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఒకరోజు పచ్చగా, మరొకరోజు దుర్వాసనతో బురదగా ప్రస్తుతం ఎరుపురంగుతో నీరు వస్తోంది. ఈ విధంగా రంగుమారి వస్తున్న నీటిని చూసి ప్రజల్లో రకరకాల ఆలోచనలు వస్తున్నాయి. నీరు తాగవచ్చా లేదా అనే సందేహంలో ఉన్నారు. అసలే వేసవి ఆపై రంగుమారి వస్తున్న నీరు తాగితే ఎక్కడ వ్యాధులు వ్యాప్తిస్తాయోనని భయాందోళన చెందుతున్నారు. కొద్ది రోజులుగా పట్టణంలో ఇదే తంతు. మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టీపట్టనట్లు వ్యవహరించటమే కాకుండా సరైన సమాధానం చెప్పడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. అసలే అనేక చోట్ల పైపులైన్‌లకు లీక్‌లు ఏర్పడి రోజుకో చోట మరమ్మతులు చేస్తున్నారు. దీనివల్ల లీక్‌అయిన పైపులోకి మురుగు వెళ్లి ఈ విధంగా వస్తుందేమోననే అనుమానం కొందరు వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఒక్కసారిగా ఎర్రటిరంగులో నీరు రావటంతో ఇటు పట్టణ ప్రజలతోపాటు అటు అధికారుల్లో కూడా అనుమానాలు రేకెత్తాయి. దీంతో గుంటూరు మెడికల్ కళాశాల నుంచి నిపుణులను పిలిపించి ఓవర్‌హెడ్ ట్యాంక్‌లలో, సమ్మర్ స్టోరేజి ట్యాంక్‌లలో నీటి శాంపిల్స్‌ను సేకరించి పరిశీలించారు.



మూడో వార్డు రాజీవ్‌గాంధీకాలనీలో రంగు మారిన తాగునీరు



మున్సిపల్ సమ్మర్‌స్టోరేజి ట్యాంక్‌లో నీటి నమూనాలను సేకరిస్తున్న ఏఈ ప్రసాద్, సిబ్బంది

వీటివల్ల కాల్వల ద్వారా వచ్చిన నీటిని చెరువులోకి పెట్టటం వల్ల, కాపర్‌సల్ఫేట్ కల్పటం వల్ల జరిగిందా అనే దానిపై ఆరా తీశారు. అయితే తాగునీటిలో ఫ్లోరిన్ సక్రమంగానే ఉందని అధికారులు చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికి రంగులమారి వస్తున్న నీటివల్ల ప్రజల్లో రకరకాల అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. దీనిని నివృత్తి చేసి సమస్యను పరిష్కరించాల్సిన గురుతర బాధ్యత మున్సిపల్ అధికారులపై ఎంతైనా ఉంది. కాగా ఈ విషయమై మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డిని వివరణ కోరగా తాగునీటితో ఏ విధమైన ఇబ్బందులులేవని చెప్పారు. అన్ని పరిశీలించి తగిన చర్యలు చేపట్టామని శుక్రవారం నుంచి శుభ్రమైన నీటిని సరఫరా చేస్తామని చెప్పారు.

కుటుంబ సాధికార సారధుల నియామకం చేపట్టాలి

- ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కుటుంబ సాధికార సారదుల నియామక ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని మండల స్థాయి నాయకులకు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సూచించారు. గురువారం భట్టిప్రోలులోని వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో పార్టీ మండల అధ్యక్షుడు వాకా శేషుబాబు అధ్యక్షతన జరిగిన టీడీపీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ నియోజకవర్గంలో అత్యధికంగా పార్టీ సభ్యత్వాలు నమోదు చేసిన కార్యకర్తలందరిని అభినందిస్తున్నామన్నారు. పార్టీ ఆదేశాల మేరకు ప్రతి 60 మంది ఓటర్లకు కుటుంబ సాధికార సారధులను సత్వరమే నియమించుకోవాలన్నారు. భవిష్యత్తులో గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి అన్ని కమిటీలను నియమిస్తామన్నారు. సమావేశంలో పార్టీ పరిశీలకులు వంగా సాంబిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, జడ్పీటీసీ ఉదయభాస్కరి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, నాయకులు జయశీలరావు, సుందరరావు, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వార్షిక బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక పూజలు

సహస్రాబ్ది వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం మండలపరిధిలోని చిలుమూరు ఉభయ రామేశ్వర స్వామి ఆలయంలో ఆనందబాబు వ్యవస్థాపక ధర్మకర్త పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. అనంతరం రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈపూరుకు చెందిన టీడీపీ నాయకులు మల్లంపాటి హరిప్రసాద్ ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో కొల్లూరు నాగశ్రీధర్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంతో మెరుగైన ఫలితాలు

చుండూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి సంక్షేమ పథకాల అమల్లో ప్రభుత్వం మెరుగైన ఫలితాలు సాధిస్తుందని ఎమ్మెల్యే ఆనందబాబు తెలిపారు. గురువారం చుండూరులో జరిగిన టీడీపీ మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆనందబాబు గత ప్రభుత్వం సాగించిన రాక్షస పాలనలో అనేక వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయి. వీటిని సరి చేసుకుంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టి దేశంలోనే రాష్ట్రానికి గుర్తింపు తెస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు గుడేటి ఎల్లారెడ్డి, వివిఎస్‌కె ప్రసాద్, బాలకోటిరెడ్డి, వెంకటరెడ్డి, భీమవరపు శ్రీమాన్, కావూరి శ్రీనివాసరావు, దేవిరెడ్డి నాగేశ్వరరావు, పిట్టు వెంకటరెడ్డి, తన్నీరు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్షలకు ఆన్‌లైన్ శిక్షణ

చుండూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలో టెట్ పరీక్షల్లో క్వాలిఫై అయిన ఎస్సీ, బీసీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులకు ఆన్‌లైన్ ద్వారా డీఎస్సీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.సుదీప గురువారం వెల్లడించారు. టీటీసీలో మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తారన్నారు. అర్హులైన వారు తమ బయోడేటాతో పాటు 10వ తరగతి, టీటీసీ, టెట్ మార్కులిస్టులు, కుల ధ్రువీకరణ, ఆధార్, బ్యాంకు పాస్‌బుక్ నకలు, 2 పాస్‌పోర్టు ఫొటోలు జతపరిచి జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారికి దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9963633578లో సంప్రదించాలని తెలిపారు.

చెరుకుపల్లి, (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన వెనుకబడిన తరగతులకు చెందిన అర్హులైన అభ్యర్థుల నుంచి ఎస్సీ రిక్రూట్‌మెంట్ 2025 పరీక్షలకు ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని ఒక ప్రకటనలో తెలియజేశారు.

రేపు నంది వాహనోత్సవం

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందోలులో ఉన్న శ్రీగంగా పార్వతి సమేత శ్రీలింగోద్భవస్వామి ఆలయంలో ఈనెల 12న నందివాహనోత్సవం నిర్వహిస్తారు. అదేరోజు సాయంత్రం శ్రీవీరాంజనేయ భజనసమాజం వారి ఆధ్వర్యంలో భజన జరుగుతుందని ఈవో తెలిపారు.

వెట్టి కోసం విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలి



బొబ్బర్లంకలోని ఎస్టీ కుటుంబాలను వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీపీఎం కేవీపీఎస్ ఐద్వా నేతలు

రేపల్లె, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఎస్టీ కుటుంబాలను 15సంవత్సరాల నుంచి విక్రయించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసులు నమోదు చేయాలని సీపీఎం బాపట్ల జిల్లా కార్యవర్గసభ్యులు సీహెచ్ మణిలాల్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని బొబ్బర్లంకకు చెందిన వెట్టిచాకిరికి గురైన ఎస్టీ కుటుంబాలను పరామర్శించి వారి నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంబూరు పద్మ, అగ్ని భార్యాభర్తలు ఇద్దరు బాధితులు తమను వెట్టిచాకిరి కోసం విక్రయించిన విషయం కలెక్టర్, పోలీసులకు ఫిర్యాదు చేసిన అనంతరం విషయం వెలుగులోకి వచ్చిందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సమాజంలో ఎన్ని చట్టాలు ఉన్నప్పటికి కుల వివక్షకు, దోపిడీకి అన్యాయానికి గురౌవుతున్నారని తెలిపారు. రాజ్యాంగంలో అనేక హక్కులు ఉన్నప్పటికి చెన్ను కోటేశ్వరావు, వెంకటేశ్వరరావు, యోగేసు, అశ్వారావులు 15 సంవత్సరాల నుంచి మనుషులను విక్రయిస్తూ వెట్టిచాకిరి చేయించుకుని వారి శ్రమను దోచుకుని లక్షలాది రూపాయలు సంపాదించుకున్నారు. వీరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కేవీపీఎస్ ఐద్వా నాయకులు కేవీ లక్ష్మణ్‌రావు, కే ఆశీర్వాదం, డీ ఆగస్టీన్, కే నాంచారమ్మ, జీ డానియేలు తదితరులు పాల్గొన్నారు.

వసూళ్ల పేరుతో వేధిస్తే చర్యలు : సీఐ రాంబాబు



ఫైనాన్స్ వ్యాపారులు, రికవరి ఏజెంట్‌లతో మాట్లాడుతున్న పట్టణ సీఐ రాంబాబు

బాపట్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఫైనాన్స్ వసూళ్ళ పేరుతో లోన్ తీసుకున్న వాళ్ళను వేదిస్తే చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ ఆర్ రాంబాబు హెచ్చరించారు. ఎస్పీ తుషార్ ఆదేశాల మేరకు స్థానిక డీఎస్పీ కార్యాలయ ఆవరణంలో మైక్రోఫైనాన్స్, ఫైనాన్స్ వ్యాపార నిర్వాహకులు, రికవరీ ఏజెంట్‌లతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పట్టణ, చుట్టుపక్కల గ్రామాలలోని ప్రైవేట్ బ్యాంకులు, ఫైనాన్స్ వ్యాపార నిర్వాహకులు, రికవరి ఏజెంట్‌లు రుణగ్రహీతలు తీసుకున్న లోన్ సకాలంలో చెల్లించకపోతే నిబంధనల మేరకు వ్యవహరించాలని సూచించారు. ఇటీవల పలు ఫైనాన్స్‌కంపెనీ ఏజెంట్‌లపై ఆరోపణలు వస్తున్నందున ఉద్యోగులు తప్పకుండా చట్టబద్ధంగా కంపెనీ నిబంధనలు పాటించాలని చెప్పారు. రుణగ్రహీతలను ఎలాంటి వేధింపులకు గురిచేయరాదన్నారు. కంపెనీద్వారా లీగల్‌గా నోటీసులు అందజేసి కోర్టు జారీచేసే ఆదేశాల మేరకు నడుచుకోవాలని సూచించారు. సమావేశంలో రూరల్ సీఐ శ్రీనివాసరావు, సర్కిల్ సీఐ హరికృష్ణ,సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల భద్రత కోసమే శక్తియాప్

- మహిళా పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు

బాపట్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) :శక్తియాప్ మహిళల భద్రత కోసం రూపొందించబడినందని, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం పొందటానికి ఉపయోగపడుతుందని మహిళా పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు పట్టణంలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల, శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో శక్తియాప్ గురించి విద్యార్థినులకు గురువారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలకు సీఐ శ్రీనివాసరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఆపదలో చిక్కుకున్న విద్యార్థినులు యాప్‌లోని ఎస్‌వోఎస్ బటన్ ప్రెస్ చేస్తే దగ్గరల్లోని పోలీసులకు నిమిషాల వ్యవధిలో సమాచారం చేరి అక్కడకు వచ్చి రక్షణ కల్పిస్తారన్నారు. మహిళలు ఒంటరిగా ప్రయాణం చేసే సమయంలో యాప్‌లోని సేఫ్ ట్రావెల్‌లను ఆప్షన్‌ను ఎంచుకుంటే సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవచ్చునని చెప్పారు. యాప్‌లో మహిళలకు అవసరమై సమాచారం పొందుపర్చి ఉందన్నారు. సఖీవన్ స్టాప్ సెంటర్, అత్యవసర ఫోన్ నెంబర్లు దగ్గరలోని పోలీసుస్టేషన్, కార్యాలయాలు వివరాలు, ఫోన్‌నెంబర్లు ఉన్నాయని చెప్పారు. కావున ప్రతి మహిళ శక్తియాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శక్తి బృందం ఎస్ఐ పి.జనార్దనరావు, ఉమెన్ ఏఎస్ఐ ఎల్ లక్ష్మీరాజ్యం, కళాశాల అసోసియేట్ డీన్ ఎం సర్దార్ బేగ్ పాల్గొన్నారు.

పాలక వర్గాలు చేనేతపై వివక్ష విడనాడాలి

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పాలక వర్గాలు చేనేత పరిశ్రమపై వివక్ష విడనాడాలని సంఘ రాష్ట్ర కార్యదర్శి జి.బాలాజీ పేర్కొన్నారు. గురువారం 89వ చేనేత కార్మిక సంఘ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని భట్టిప్రోలులోని సంఘ కార్యాలయం వద్ద గురువారం సీనియర్ చేనేత కార్మికులు కొత్తవరపు పార్థసారధి చేత జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యలు ప్రభుత్వాలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో చేనేత సంఘ రాష్ట్ర సభ్యులు కొడాలి రామకోటేశ్వరరావు, కె.వీరమోహనరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

- పట్టణ సీఐ రాంబాబు

బాపట్ల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకంగా పనిచేస్తాయని పట్టణ సీఐ రాంబాబు తెలిపారు. చారిత్రక ప్రసిద్ధిగాంచిన శ్రీమత్సందరవల్లీ రాజ్యలక్ష్మీ క్షీరభావన్నారాయణస్వామి దేవాలయం సమీపంలో గురువారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. రథంబజారు వైపు ఒక కెమెరా, మహాత్మా గాంధీ రోడ్డు మరొక కెమెరాలను ఏర్పాటు చేసి వాటి పనితీరును సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. నేరాలు జరగకుండా చర్యలు చేపట్టడమే కాకుండా ట్రాఫిక్ సమస్యను పరిసర ప్రాంతాల్లో గస్తీకి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు వీటి ద్వారా పరిశీలిస్తామన్నారు. తద్వారా నేరాలను అరికట్టేందుకు చర్యలు చేపడతామన్నారు సీఐ తెలిపారు.

రూ.20లక్షలతో సీసీ రహదారి అభివృద్ధి

రేపల్లె, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తీరప్రాంతంలో రహదారుల అభివృద్ధి కోసం రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ కోట్లాది రూపాయలు వెచ్చించి గ్రామాలను అభివృద్ధిచేస్తున్నట్లు నీటి సంఘాల డైరెక్టర్ కూచిపూడి మోహన్‌రావు అన్నారు. గురువారం నిజాంపట్నం మండలం అడవులదీవి గ్రామంలో ఎన్‌జీఎన్‌ఆర్‌ఎస్ కింద రూ.20లక్షల నిధులు మంజూరుచేశారు. ఈనిధులతో గ్రామంలో సీసీ రహదారుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో గ్రామంలో ఒక్కరోడ్డు కూడా వేసిన దాఖలాలు వైసీపీ ప్రభుత్వం చెయ్యలేదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిపెట్టి ముందుకు వెళుతున్నారన్నారు. నిధులు మంజూరుచేసిన మంత్రి అనగానికి గ్రామస్థుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శొంఠి శ్రీనివాసరావు, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు



అల్లూరులో ఉన్న శ్రీరాజ్యలక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాజ్యలక్ష్మీసమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి సహస్రాబ్ది షష్ఠ మహాదశ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మండలంలోని అల్లూరులో కొలువైయున్న శ్రీలక్ష్మీ నరసింహస్వామికి గురువారం కాండూరివారి ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎంవీఎస్ వర్మ తెలిపారు. కార్యక్రమంలో హనుమత్ వాహనంపై శ్రీలక్ష్మీ నరసింహస్వామి అమ్మవార్ల ఊరేగింపు కార్యక్రమాన్ని శ్రీమాను కాండూరు వెంకటరామానుజాచార్యులు వారి కుటుంబసభ్యులు ఉదయం 8గంటలకు శ్రీలక్ష్మీనరసింహస్వామి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు పాల్గొనాలని కోరారు.

సారా తయారీ స్థావరంపై పోలీసులు దాడి

- 200 లీటర్ల బెల్లంఊట 10 లీటర్ల సారా స్వాధీనం

బాపట్లరూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం వెదుళ్ళపల్లి గ్రామసమీపంలో నాటుసారా స్థావరం తయారీపై గురువారం వెదుళ్ళపల్లి పోలీసులు, ఎక్సైజ్‌శాఖ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో దాడి నిర్వహించారు. వెదుళ్ళపల్లి ఎస్ఐ భాగ్యరాజు తెలిపిన వివరాలు ప్రకారం వెదుళ్ళపల్లి గ్రామశివారులో నాటుసారా తయారీ స్థావరంపై దాడి నిర్వహించి 200లీటర్లు బెల్లంఊటను ధ్వంసం చేయటంతోపాటు 10లీటర్ల సారాని స్వాధీనం చేసుకొని సీజ్ చేశారన్నారు. అదేవిధంగా సారా తయారు చేస్తున్న రామకోటేశ్వరరావు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారన్నారు. సారా తయారు చేసిన, విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెదుళ్ళపల్లి ఎస్ఐ హెచ్చరించారు.

మీ ఆరోగ్యం మా బాధ్యత : ఎమ్మెల్యే నరేంద్రవర్మ



బాధిత కుటుంబాలవారికి సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

బాపట్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మీ ఆరోగ్యం మా బాధ్యతగా భావించి అనారోగ్యంతో బాధపడే ప్రతి కుటుంబానికి ఖరీదైన వైద్యం ఉచితంగా అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ స్పష్టం చేశారు. మండలంలో అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 8 కుటుంబాలవారికి గురువారం సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. మండలంలోని కొండుభొట్లపాలెం గ్రామానికి చెందిన తోటకూర నాగమణికి రూ.2లక్షలు, పల్లా సామ్రాజ్యంకు రూ.81,084, నూతక్కి వీరయ్యకు రూ.47,726, చెరువుజమ్ములపాలెంకి చెందిన మెట్ల శివనాగేశ్వరమ్మకు రూ. 94.913, పిన్నిబోయనవారిపాలెంకి చెందిన మద్దెబోయన పెద వెంకటేశ్వర్లుకు రూ.81వేలు, నక్కల వెంకట్రావుకు రూ.61,913, ఇందేటి గోపికుమార్ యాదవ్‌కు రూ.38,614, దబ్బకూటి సామ్రాజ్యంకు రూ.31,784ల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ, తెలుగుయువత నాయకుడు ఉమ్మారెడ్డి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తీరంలో ముగిసిన సాగర్ కవచ్

- సమర్థవంతంగా వ్యవహరించిన మెరైన్, రూరల్ పోలీసులు

బాపట్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ కోస్టగార్డ్ ఆధ్వర్యంలో సూర్యలంక సముద్రతీరంలో నిర్వహించిన సాగర్ కవచ్ గురువారం సాయంత్రంతో ముగిసింది. డీఎస్పీ జి.రామాంజనేయులు ఆధ్వర్యంలో మెరైన్, రూరల్ పోలీసులు సమర్థవంతంగా వ్యవహరించి రెడ్‌ఫోర్స్ సిబ్బందిని నియంత్రించి వారి వద్ద ఉన్న వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. రెడ్‌ఫోర్స్ సిబ్బందిని ఆధీనంలోకి తీసుకొని ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ప్రాదేశికజలాల సంరక్షణ, పటిష్ఠత, తీరప్రాంత భద్రత, రక్షణ, అభివృద్ధి, చొరబాటుదారులు, వలసదారులు, తీవ్రవాదులు, ఉగ్రవాదులు, ఆసాంఘికశక్తులను భూభాగంలో ప్రవేశించకుండా నిరోధించేందుకు సాగర్ కవచ్ ద్వారా శిక్షణ ఇవ్వటం జరుగుతుందని పోలీసులు తెలిపారు. ఏడాదిలో రెండుసార్లు ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మెరైన్ సీఐ లక్ష్మారెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐలు నాగ శివారెడ్డి, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-అభ్యాస్ ఒలంపియాడ్‌లో 'శ్రీరామాకు' అవార్డులు



రాష్ట్ర స్థాయి అవార్డులు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఉమారాణి

కొల్లూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఈ-అభ్యాస్ ఒలంపియాడ్‌లో తమ విద్యార్థులు రాష్ట్ర స్థాయి అవార్డులు సాధించినట్లు శ్రీరామా రూరల్ అకాడమీ చైర్మన్ తులసీ విష్ణుప్రసాద్ గురువారం తెలిపారు. ఈ-అభ్యాస్ యాజమాన్యం నిర్వహించిన ఈ-అభ్యాస్ ఒలంపియాడ్‌లో సీబీఎస్‌ఈ ఉన్నత పాఠశాల విద్యార్థులు నలుగురు రాష్ట్ర స్థాయిలో మొదటి రెండు ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. 6వ తరగతి విద్యార్థి కె.సూర్యతేజ, 7వ తరగతి విద్యార్థి పి.శ్రీనివాసరెడ్డి , 8వ తరగతి విద్యార్థిని కె.శ్రీజలు మొదటి ర్యాంకు, 9వ తరగతి విద్యార్థి పి.హర్షవర్ధన్ రెండో ర్యాంకు సాధించారు. ఈ నెల 13న గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈ-అభ్యాస్ వ్యవస్థాపలు భువనగిరి ఫణిపవన్ తెలిపారు. విద్యార్థులను తులసీ విష్ణుప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

చట్ట ప్రకారమే రికవరీ ఏజెంట్లు నడుచుకోవాలి

- డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు

రేపల్లె, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఫైనాన్స్ కంపెనీల రికవరీ ఏజెంట్లపై పలు వివాదస్పద ఆరోపణలు వస్తున్నాయని చట్టప్రకారమే వారు నడుచుకోవాలని లేని యెడల వారిపై చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు తెలిపారు. గురువారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో మైక్రోఫైనాన్స్ నడిపే రికవరీ ఏజంట్లు, మేనేజర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్టమర్లతో ఏజంట్లు నిబంధనలకు అనుగుణంగానే నడుచుకోవాలన్నారు. దౌర్జన్యాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. ఫైనాన్స్ కంపెనీ నిబంధనలకు అనుగుణంగానే వ్యవహరించాలని కొంతమంది ఏజంట్లు అత్యు త్సాహం ప్రదర్శిస్తున్నారని అలా చేసిన యెడల కేసుల్లో ఇరుక్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ మల్లికార్జున్‌రావు, ఫైనాన్స్ కంపెనీ ఏజెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో వర్క్‌షాపు ప్రారంభం



ప్రారంభ సభలో మాట్లాడుతున్న బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు

బాపట్లరూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో బీటెక్ మూడో సంవత్సరం విద్యార్థులకు రియాక్ట్, మెర్న్‌స్టాక్ ఉపయోగించి ఆధునిక వెబ్ అప్లికేషన్‌లను నిర్మించటంలో ఆచరణాత్మక నైపుణ్యాలను పెంపొందించటానికి మూడురోజుల వర్క్‌షాపును గురువారం ప్రారంభించారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో కళాశాల సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ వెబ్ అప్లికేషన్ తయారిలో ఆధునీక నైపుణ్యాలు పెంచుకోవటంలో ఈవర్క్‌షాపు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. సెక్రటరి మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ బీటెక్ చదివే సమయంలో, ఉద్యోగాలలోకి వెళ్ళినప్పుడు కావాల్సిన నూతన అప్లికేషన్ తయారీ విధానం తెలుసుకోవటం వల్ల ఉద్యోగ జీవితం సులభతరం అవుతుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, రీసోర్స్‌పర్సన్ శ్రీధర్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలి

- జిల్లావైద్యాధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్ విజయమ్మ

బాపట్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : వైద్యసిబ్బంది ఎవరికి నిర్ణయించిన బాధ్యతలు వారు సక్రమంగా పూర్తి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ తెలిపారు. బాపట్ల ఏరియా వైద్యశాలలో గురువారం హెచ్ఎంఐఎస్, ఆర్‌సీహెచ్ ప్రోగ్రామ్ మీద డిస్ట్రిక్ టీవోటీసీలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి డీఎంహెచ్‌వో అధ్యక్షత వహించి మాట్లాడుతూ అందరికీ అర్థమయ్యే విధంగా ట్రైనింగ్ ఇచ్చి గోల్స్ సాధించాలన్నారు. ట్రైనింగ్ తీసుకున్న టీవోటీఎస్‌లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక, డీపీఎంవో డాక్టర్ భూషణం, డీఐవో మనోజ్, ఎన్‌సీడీపీవో లలిత, రాజేశ్వరి, ఎస్‌వో వేణు, డీపీవో ప్రేమపావని, సీహెచ్‌వో మల్లికార్జునరావు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఉపాధికి ఊతం!





గుంటూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వారిని సంక్షేమ పథకాల తాత్కాలిక బుజ్జగింపులతో సరిపెట్టకుండా, స్వయం ఉపాధి కల్పన దిశగా నడిపించేందుకు కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలోనే దాదాపు ఆరేళ్ల క్రితం ఆగిపోయిన బీసీ ఉపాధి కార్యక్రమాలను ప్రభుత్వం తెరమీదకు తెచ్చింది. ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ ముందుకు వెళ్లింది

- బడుగు బలహీన వర్గాల స్వయం ఉపాధికి పెద్దపీట
- ఐదేళ్ల తరువాత మళ్లీ కార్పొరేషన్ రుణాల మాట
- 50 శాతం సబ్సిడీతో బీసీలకు భారీగా రుణాలు
- తిరిగి తెరమీదకి ఆదరణ- 3 పథకం పనిముట్ల పంపిణీ
- ఇప్పటికే పెద్ద సంఖ్యలో దరఖాస్తులు

కార్పొరేషన్లలో జోష్..

2014-19కి మధ్య బీసీ కార్పొరేషన్ ద్వారా వివిధ బీసీ కులాలకు చెందిన యువకులు స్వయం ఉపాధి రుణాలు పొందేవారు. 50 శాతం రాయితీతో రూ. 2 లక్షల రుణం తీసుకుని, అందుబాటులో ఉన్న ఏదో ఒక ఉపాధిరంగాన్ని యువత ఎంచుకునేది. అలాంటి కార్పొరేషన్‌ను వైసీపీ ప్రభుత్వం ముక్కచెక్కలు చేసింది. 56 కార్పొరేషన్లుగా విడగొట్టి ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా కార్పొరేషన్ చైర్మన్లను ఉత్సవ విగ్రహాలుగా నిలబెట్టింది. కూర్చోడానికి కుర్చీలు ఇవ్వలేదన్న విమర్శలు అప్పట్లో బలంగా వినిపించాయి. కాగా కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. బీసీ కార్పొరేషన్లకు హుటా హుటిన చైర్మన్లను నియమించడమే కాకుండా వాటి ద్వారా ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపడుతున్నారు. కార్పొరేషన్ల ద్వారా గరిష్ఠంగా రూ. 8లక్షల వరకూ 50 శాతం సబ్సిడీతో రుణాలు ఇచ్చేందుకు ప్ర భుత్వం చర్యలు తీసుకుంది. తొలివిడతగా ఒక్కో ని యోజకవర్గం నుంచి 15 మందికి ఆ రుణాలు అందిం చనున్నారు. ఇప్పటికే జిల్లాలో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమయింది. ఇప్పటి వరకూ గుంటూరు జిల్లా లో 13,435, పల్నాడు జిల్లాలో 9,177, బాపట్ల జిల్లా లో 10,128 మంది కార్పొరేషన్ రుణాలకోసం దర ఖాస్తు చేసుకున్నారు.

జిల్లాలో ఆదరణ-3 పైలట్ ప్రాజెక్టు

ప్రభుత్వం ఆదరణ- 3 పథకాన్ని గుంటూరు జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద ప్రారంభించింది. ఆదరణ-పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 135 కులాలకు చెందిన నాలుగు లక్షల మందికి 90 శాతం సబ్సిడీతో రూ. 964 కోట్ల విలువ చేసే పనిముట్లను అందజేసింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక పథకాన్ని ఆపేసింది. అప్పటికే ప్రభుత్వం దగ్గర ఉన్న పనిముట్లను కూడా లబ్ధిదారులకు ఇవ్వకుండా వదిలేయడంతో అవి పాడైపోయాయి. మళ్లీ ఆదరణ- 3 పథకాన్ని ప్రారంభించారు. ఆదరణ- 3 ద్వారా కల్లుగీత కార్మికులు, కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, గొర్రెల కాపరులకు, వడ్డెర, భవన నిర్మాణ కార్మికులు, నాయి బ్రాహ్మణులు, రజకులు, చేనేత కార్మికులు, టైలర్స్, పాల వ్యాపారులు, ఎలక్ట్రీషియన్లకు రూ. 10 నుంచి 30వేల విలువ చేసే పనిముట్లు అందజేయనున్నారు. త్వరలో దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం కానుంది.

గౌడ వర్గీయులకు మద్యం దుకాణాలు

కూటమి ప్రభుత్వం వచ్చాక మద్యం పాలసీ మారింది. పాత పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకే మద్యం దుకాణాలు కేటాయించారు. వాటిలో బలహీన వర్గాలకు భాగస్వామ్యం కల్పిస్తూ 10 శాతం షాపులను గౌడ వర్గీయులకు కేటాయించింది. తద్వారా గుంటూరు జిల్లాలో 13, పల్నాడు జిల్లాలో 13, బాపట్ల జిల్లాలో 12 షాపులు వారికి దక్కాయి. చేనేత కార్మికులకు మగ్గం ఉన్న ప్రతి కుటుంబానికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వడంతో మూడు జిల్లాల్లో 35వేల కుటుంబాలకు మేలు జరుగుతోంది. దీంతోపాటు బీసీలకు పీఎం సూర్యఘర్ సోలార్ ప్లాంటు కోసం రూ. 20వేలు అదనపు సబ్సిడీ ప్రకటించింది.

80వేల మంది మహిళలకు శిక్షణ

స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం ద్వారా బీసీ మహిళలకు కుట్లు, అల్లిక పనుల్లో శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించబోతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 80వేల మందికి శిక్షణ ఇచ్చి, కుట్టు మిషన్లు అందజేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గొర్రెలు, పాడిగేదెలు, పశువులకు కూడా రుణాలు అందజేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి సంబంధించి విధివిధానాలపై ఇంకా స్పష్టత రాలేదు.





సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

మే చివరికి పీఎంశ్రీ పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి

గుంటూరు (విద్య)ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఉమ్మడి జిల్లాలో పీఎం శ్రీ పథకం పేరుతో పాఠశాలల్లో చేస్తున్న పనులు మే నెలాఖరు నాటికి పూర్తి చేయాలని పాఠశాల విద్య సంయుక్త సంచాలకులు (ఆర్జేడీ) లింగేశ్వరరెడ్డి సూచించారు గురువారం కలెక్టరేట్ లోని ఆర్జేడీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు ఉమ్మడి జిల్లాలో ఫేస్ వన్ ,ఫేస్ టు కింద పిఎం శ్రీ పాఠశాలలు మంజూరు అయ్యాయని ఆయా పాఠశాలల్లో చేస్తున్న పనులు సత్వరం పూర్తి చేసేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. నాణ్యత విషయంలో రాజీ పడకుండా కేంద్ర ప్రభుత్వం సూచించిన విధంగా పనులు చేయాలని స్పష్టం చేశారు. గడచిన ఐదు సంవత్సరాలలో చేసిన పనుల గురించి సమీక్షించారు. కార్యక్రమంలో డీఈఓ రేణుక, సమగ్ర శిక్ష ఇంజనీర్లు నాగజ్యోతి, హరిబాబు, పీఎంశ్రీ పథకం సంచాలకులు సురేష్‌కుమార్ పాల్గొన్నారు.



గురుకుల స్కూల్ భవనం

గిరిజన గురుకులం సిద్ధం

- ప్రారంభోత్సవ ఏర్పాట్లలో గిరిజన శాఖ
- పెదతురకపాలెం వద్ద రూ.8.20 కోట్లతో నిర్మాణం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని గిరిజన విద్యార్థులకు గురుకుల విద్య అందుబాటులోకి రానున్నది. ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించేందుకు గిరిజన సంక్షేమ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. నరసరావుపేట మండలంలోని పెదతురకపాలెంలో గిరిజన గురుకుల పాఠశాల గత టీడీపీ ప్రభుత్వంలో మంజూరై పనులు చేపట్టారు. అయితే వైసీపీ హయాంలో నిధుల కొరతతో నిర్మాణం నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిధులు విడుదల చేసింది. దీంతో శరవేగంగా భవనాల నిర్మాణం పూర్తి చేశారు. తరగతి గదులు, బాలుర వసతి గృహాలు, స్టాఫ్ నివాస గృహాల నిర్మాణం పూర్తయింది. ఈ భవనాలను రూ.8.20 కోట్లతో నిర్మించారు. 250 సీట్లను కేటాయించగా త్వరలో అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయి. గిరిజన బాలుర విద్యాభివృద్ధికి గురుకుల పాఠశాల దోహదపడనున్నది. బాలుర స్కూల్‌ను ప్రారంభించేందుకు విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామిని గిరిజన శాఖ అహ్వానించనున్నది. ప్రారంభోత్సవ తేదీని త్వరలో ఖరారు చేయనున్నట్లు సదరు అధికారులు తెలిపారు.



విద్యార్థుల వసతి గృహాలు

కుంభకోణంపై.. కనికరమా?

(5వ పేజీ తరువాయి)

ఇదే తీరు. జగనన్న కాలనీల పేరుతో పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామంటూ స్థలం కొనుగోలు నుంచి ఇల్లు కట్టించి ఇచ్చే వరకు అంతటా అక్రమాలే. ఇందులో లబ్ధిదారులకు ఎటువంటి మేలు జరగకపోగా అటు అధికారులు, ఇటు నేతల మధ్య భారీగానే పంపకాలు జరిగాయి. పేదలకు ఇళ్ల స్థలాల కోసమని ప్రభుత్వం భూసేకరణకు ప్రకటన చేయగా రైతులు ఎవరూ ముందుకు రాలేదు. ఈ క్రమంలో పెదరావూరులో టీడీపీ నాయకులతోనే సిఫార్సులు చేయించుకుని కొంత భూమిని కొని మార్కెట్ రేటుకు మించి అదనంగా రెండున్న రెట్లు డబ్బు చెల్లించారు. దీంతో మిగిలిన ప్రాంతాల్లో రైతులు ముందుకొచ్చారు. ఆ తర్వాత వైసీపీ నేతలు రంగంలోకి దిగి భూమాయ చేశారు. ఒక్క తెనాలిలోనే వైసీప దళారులు రంగప్రవేశం చేసి రైతుల వద్ద భూమిని తక్కువకు కొని రెండున్నర రెట్లకు ప్రభుత్వానికి ఇచ్చి భారీగా లబ్ధి పొందారు. పెదరావూరులో ప్రభుత్వం ఇచ్చిన నగదులో వాటాగా ఇవ్వమని నేతలు ఒత్తిడి చేయగా భూములను వెనక్కు తీసుకుంటామని రైతులు హెచ్చరించడంతో వదిలేశారని సమాచారం. మిగిలిన లేఅవుట్లలో అదనంగా డబ్బు వచ్చేలా చేసినందుకు ఎకరాకు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు నేతలకు మామూళ్ల కింద వసూలు చేశారు. 2019లో తెనాలి ఐతానగర్‌కు సమీపంలో ఉన్న భూములను ఎకరా రూ.38 లక్షలకు భూములు ఇచ్చేందుకు ప్రభుత్వంతో రైతులు ఒప్పందం చేసుకున్నారు. అయితే ఆ తర్వాత వైసీపీ హయాంలో పట్టణానికి 4 నుంచి 6 కిలో మీటర్ల దూరంలోని భూములకు రూ.92 లక్షలకు పైగా ముట్టచెప్పడం భూ కుంభకోణానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇలా ఒక్క తెనాలిలో రూ.393.51 కోట్లు ఖర్చుపెట్టి 526.36 ఎకరాల భూమిని రైతుల నుంచి కొనుగోలు చేశారు. ఒక్క తెనాలిలో మాత్రమే రూ.100 కోట్లకు పైగా చేతులు మారితే, రాష్ట్రం మొత్తంలో ఏ మేర భూ కుంభకోణం జరిగిందనేది ఊహకే అందని విషయం. ఎకరాకు రూ.10 లక్షలు, రూ.17.5 లక్షల చొప్పున వాటాలిచ్చినందుకు తమకు ఇబ్బందేమీ లేదని, తమకు మార్కెట్ రేటుపై పెద్ద లాభమే జరిగిందని, ఆ విశ్వాసంతో కుంభకోణం జరిగినట్లు చెప్పడానికి రైతులు ముందుకు రావడంలేదని సమాచారం.

అధికారులకూ భారీగానే..

పేదల ఇళ్లకోసం కొన్న భూముల్లో నేతలకు మేళ్లు చేసిపెట్టినందుకు అధికారులకూ భారీగానే ముడుపులు అందినట్లు సమాచారం. ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేశారన్న ఆరోపణలున్నాయి. గోలీల డొంక లేఅవుట్‌లో ఎకరాకు రూ.2 లక్షల చొప్పున 60 ఎకరాల్లో రూ.12 కోట్లు వసూలు చేసి రెవెన్యూ అధికారులు పంచుకున్నట్లు సమాచారం. మిగిలిన లేఅవుట్లలో వచ్చిన వాటాలు కలిపితే రూ.15 నుంచి రూ.20 కోట్ల వరకు అధికారులకు దక్కి ఉంటుందనేది అంచనా.

ఖాతాలు శోధిస్తే గుట్టురట్టు

రైతుల ఖాతాలకు ప్రభుత్వం నుంచి వచ్చిన నగదును డ్రా చేసి అదే రోజు కొన్ని ఖాతాల్లో జమ చేసినట్లు తెలిసింది. కేవలం వీటికోసమే కొన్ని కొత్త పరం ఖాతాలు తెరిచారని, మరికొన్ని వ్యాపార సంస్థల కరెంట్ ఖాతాలు కూడా వీటి కోసం వాడుకున్నారు. పిండికొట్ల బజార్‌లోని కెనరాబ్యాంక్, ఐతానగర్‌లోని సిండికేట్ బ్యాంక్, స్టేట్‌బ్యాంక్, కోస్టల్ బ్యాంక్, బుర్రిపాలెం రోడ్డులోని బ్యాంక్ ఆఫ్ ఇండియా, మరికొన్ని బ్యాంక్‌లలో ముందే మాట్లాడుకుని బ్యాంక్ సిబ్బందితో ఒప్పందం చేసుకున్నాకే లావాదేవీలు ఏ ఆటంకం లేకుండా చేసుకున్నారని చెబుతున్నారు. ఈ ఖాతాలు పట్టుకుంటే గుట్టంతా బయటకు వస్తుందని చెబుతున్నారు. అయితే ఆయా బ్యాంక్‌లలో అప్పట్లో ఉన్న మేనేజర్‌లు, ఇతర సిబ్బంది సహకారం పుష్కలంగా ఉండటంవల్లే ఇవన్నీ సాధ్యం అయ్యాయని, వారిని కూడా విచారిస్తే తేలికగా బండారం బయటకు వచ్చే అవకాశం ఉందంటున్నారు.

అధికారుల తీరుపై అనుమానాలు..

తెనాలిలో జరిగిన భూ కుంభకోణంపై తొలి నుంచి ఆలపాటి విచారణకు పట్టుబడుతూ వచ్చారు. అప్పట్లో వైసీపీ సర్కారు పట్టించుకోకపోతే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. భూ కొనుగోళ్లు జరిపిన బుర్రిపాలెం, నేలపాడు, పెదరావూరు, కొలకలూరు, అంగలకుదురు, గుడివాడ, సంగంజాగర్లమూడి గ్రామాల్లోని నాడు భూములు విక్రయించిన రైతులను విజిలెన్స్ అధికారులు నెల నుంచి విచారిస్తున్నారు. ఆ మొత్తాలు బ్యాంక్ ఖాతాల ద్వారా కాకుండా నేరుగా డబ్బే తీసుకోవడంతో, రైతులు చెప్పే ఆధారాలు మినహా రికార్డు పరంగా ఏ ఆధారాలు లేకపోవడంతో వారు తమపైకి ఏదీ రాదనే ధీమాతో ఉన్నట్లు సమాచారం. అయితే అప్పటి వీఆర్‌వోకు ఓ రైతు తన 2 ఎకరాలకు వచ్చిన డబ్బులో రూ.1.5 లక్షలు ఇచ్చినట్లు చెబుతున్నారు. ఆ బ్యాంక్ ఖాతాలు పట్టుకోగలిగితే గుట్టు వీడుతుంది. అయితే విచారణ సాగుతున్న తీరు చూస్తే కుంభకోణం గుట్టురట్టు చేసేలా కాకుండా అక్రమార్కులను కాపాడేలా ఉన్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే కూటమి నేతలు ఈ కుంభకోణం వెనుక దాగున్న రహస్యాలను విజిలెన్స్ అధికారుల ముందుంచారని సమాచారం. అయినా విచారణలో వేగవంతం లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



యూపీఎస్‌సీ పాత ప్రశ్నపత్రాలు - సమాధానాలు పుస్తకావిష్కరణ చేస్తున్న మండలి బుద్ధప్రసాద్ తదితరులు

మాతృభాషే సంస్కృతి పరిరక్షణకు మూలాధారం

- అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్
- కేఎల్‌యూలో తెలుగు భాష అంతర్జాతీయ సదస్సు

తాడేపల్లి (వడ్డేశ్వరం), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఏ ప్రాంత సంస్కృతి పరిరక్షించబడాలన్నా ఆ ప్రాంత భాష ముందుగా రక్షించబడాలని తెలుగు భాషా సంఘం మాజీ అధ్యక్షుడు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. గురువారం వడ్డేశ్వరం కేఎల్ డీమ్డ్ యూని వర్సి టీలో బీఏ ఐఏఎస్ విభాగం అధిపతి శివనాగయ్య అధ్యక్షతన సదస్సు ఏర్పాటు చేశారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ప్రక్రియలు, వాదా లు, సమాలోచన అనే అంశంపై ప్రారంభమైన రెండు రోజుల అంతర్జాతీ య సదస్సుకు బుద్ధ ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ హితమే సాహిత్యం పరమావ ధని చెప్పారు. విశిష్ట అతిథిగా హాజరైన రాష్ట్ర రహదారు భద్రతా విభాగం డీఐజీ సీహెచ్ విజయారావు మాట్లాడుతూ మాతృభాషలో సివిల్ సర్వీసెస్ రాసి లక్ష్యాన్ని సాధించడం సులువవుతుందన్నారు. ఈ సందర్భంగా యూని వర్సిటి ప్రచురించిన 11 సంవత్సరాల యూపీఎస్‌సీ పాత ప్రశ్నపత్రాలు- సమాధానాలు విశ్లేషణలతో కూడిన గ్రంథాన్ని వారు ఆవిష్కరించి విద్యా ర్థులకు అందజేశారు. మొదటి రోజు సదస్సులో ఆంధ్రా తెలంగాణ ప్రాంతా లకు చెందిన ప్రత్యక్షంగా 30 మంది, ఆన్‌లైన్‌లో 30 మంది ఆచార్యులు, పరిశోధనా విద్యార్థులు పరిశోధనా పత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో వాణిజ్య పన్నుల విభాగం అసిస్టెంట్ కమిషనర్ డి.రాంబాబు, ఆంధ్ర లయోల కళాశాల విశ్రాంత వైస్ ప్రిన్సిపాల్ గుమ్మా సాంబశివరావు, రచయిత్రి నయనాల వాణిశ్రీ, వీసీ సారధివర్మ, ప్రోవీసీలుతదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కే మధుమూర్తి

విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోవద్దు

ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య మధుమూర్తి





విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

పెదకాకాని, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోరాదని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కే మధుమూర్తి తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డైక్‌మెన్ హాలులో ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఏఎన్యూ మహోత్సవం -2025 గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. విద్యార్థులు ఎప్పుడు చదువును అశ్రద్ధ చేయకూడదన్నారు. ప్రతి విద్యార్థి అవకాశాలను సృష్టించుకుంటూ, అందిపుచ్చుకుంటూ అభివృద్ధి చెందాలన్నారు. ఉప కులపతి ఆచార్య గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకుని నైపుణ్యతను సమాజాభివృద్ధికి వినియోగించాలన్నారు. రెక్టార్ ఆచార్య రత్న శిలామణి మాట్లాడుతూ రెండు రోజులు జరిగే మహోత్సవంలో విద్యార్థులందరూ ఉత్సాహంగా పాల్గొని తమ విజ్ఞానాన్ని నైపుణ్యతలను ప్రదర్శించాలని కోరారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు వారి విద్యా విషయాలు మీద ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిద్ధయ్య మాట్లాడుతూ విద్యార్థులు గొప్ప పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు. అకాడమిక్ విభాగాలలో ఉత్తమ శ్రేణి సాధించిన విద్యార్థులకు బహుమతులను, సర్టిఫికెట్లను అందజేశారు. టెక్నికల్, లిటరల్లీ ఈవెంట్స్‌లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రిన్సిపల్స్ డాక్టర్ ఎం గోపికృష్ణ, డాక్టర్ బీ చంద్రమౌళి, కన్వీనర్ డాక్టర్ రవి కుమార్, డాక్టర్ సతీష్, డాక్టర్ కే చైతన్య, డాక్టర్ పూర్ణచం ద్రశేఖర్, డాక్టర్ వై సునీత, డాక్టర్ ఉమా మహేశ్వరి, డాక్టర్ తిరుమలరావు, డాక్టర్ టీవీఎస్ వరలక్ష్మి, డాక్టర్ వి.బాలాజీ, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఆవుల మందే ఆధారం



వేమూరు వద్ద పొలాల్లో మంద ఆవులు

వేమూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పూర్వ కాలంలో వేసవి మాసం వస్తే చాలు రబీ పైర్లు పూర్తి కాగానే సాగు భూముల్లో భూమి సారవంతం కోసం ఆవుల మందలను కొన్ని రోజుల పాటు ఉంచేవారు. ఆవులు సాగు భూమిలో వదిలిన మూత్రం, పేడ మగ్గిన తరువాత మట్టిలో కలిసేవి తద్వారా మొక్కకు పోషకాలు అందేవి ప్రకృతి సిద్ధమైన ఆర్గానిక్ ఎరువు ఏ పైరు వేసిన సంపూర్ణంగా అందేది పాస్పరస్, పోటాషియం, నైట్రోజన్ తగినంతగా మొక్కలకు అందడంతో పాటు ఊహించని రీతిలో దిగుబడులు కూడా వచ్చి రైతులు లాభసాటి వ్యవసాయాన్ని చవి చూసేవారు. అలాంటిది రాను రాను సేంద్రీయ ఎరువుల వాడకం పెరగడం వల్ల ఆవులు, గొర్రెలు, మేకల మందను చేలలో తోలే విధానం కూడా తగ్గిపోయింది. అక్కడక్కడ కొద్ది మంది రైతులు మాత్రమే ఆవుల మందను చేలలో కట్టు వేస్తున్న దృశ్యాలు కనబడుతున్నాయి. పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం, ప్రకాశం జిల్లా ఎర్రగొండ పాలెం ప్రాంతాలకు చెందిన కేవలం ఆవుల మంద కట్టి దానిపై వచ్చే ఆదాయంతోనే జీవనం గడుపుతున్న కొన్ని కుటుంబాలు ఈ ఏడాది కూడా మండల పరిధి లోని కొన్ని గ్రామాలకు రావడం జరిగింది. వారిని ప్రశ్నిస్తే... పూర్వ కాలంలో ప్రతి రైతు తమ భూమిలో తప్పనిసరిగా ఆవులు, గొర్రెలు మందను తోలేవారని ఆ రోజుల్లో డబ్బు తక్కువ ఇచ్చిన వలస వెళ్లిన తమ కుటుంబాలకు మర్యాదగా భోజన వసతులు కూడా కల్పించే వారని, ఈనాడు మందను కట్టి వేయడమే బాగా తగ్గిపోయిందని దాని వల్ల ఇదే జీవనంగా కొనసాగుతున్న కొన్ని వందల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్త పరుస్తున్నారు. వేసవిలో వలసగా వచ్చి జీవనం చేసుకుంటూ మిగతా రోజుల్లో ఆవులను అడవిలోకి తోలడం జరుగుతుందన్నా డు. ప్రస్తుత పరిస్థితులు తమకు దయనీయంగా ఉన్నాయని ప్రభుత్వం ఆవులే జీవనాధారంగా బతికే కుటుంబాలను ఆదుకోవాలని బొల్లాపల్లి మండలం, గంగుపల్లికి చెందిన మంద రైతు పాలం బ్రహ్మం ఆవేదన వ్యక్తపరిచాడు.



రైతు బ్రహ్మం

న్యాయం చేయండి

- పురుగుమందు డబ్బాలతో కలెక్టరేట్‌కు గ్రంథసిరి మిర్చి రైతులు



కలెక్టరేట్‌కు వచ్చిన గ్రంథసిరి మిర్చి రైతులు

గుంటూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా అచ్చంపేట మండలానికి చెందిన గ్రంథసిరి మిర్చి రైతులు తమకు జరిగిన అన్యాయంపై చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా అధికారులను ప్రాధేయపడుతున్నారు. ఇప్పటికే అనేకమార్లు మార్కె టింగ్ అధికారులు, పోలీ సులు, తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధులను ఆశ్రయించిన బాధితులు గురువారం పురుగు మందు డబ్బాలతో కలెక్టరేట్‌కు వచ్చి తమ గోడును వెళ్లబోసుకొన్నారు.

గ్రంథసిరి గ్రామానికి చెందిన రైతులు కోటపాటి రామకోటేశ్వరరావు, పరుచూరి ప్రతాప్, కిలారి నాగేశ్వరరావు, కోటపాటి నాగేశ్వరరావు, కోటపాటి నరసింహారావులు గత ఏడాది మిర్చియార్డులో విజయభాస్కర ట్రేడర్స్‌కు చెందిన గోపు శ్రీనివాసరెడ్డి, సంగిలి కిశోర్‌రెడ్డికి మిర్చిని విక్రయించారు. ఒక్కో రైతుకు రూ. 10 లక్షలకు పైగా వ్యాపారస్తులు బకాయిపడ్డారు. ఇప్పటివరకు వాళ్లకి చిల్లిగవ్వ కూడా చెల్లించకుండా తిప్పుతున్నారు. వాళ్ల వెనక వైసీపీకి చెందిన ఒక నేత ఉన్నారని ఆరోపించారు. తాము మిర్చియార్డు, మార్కెటింగ్ అధికారులను కలిసి ఫిర్యాదు చేశామని, అయితే వాళ్లపై నామమాత్రంగా చర్యలు తీసుకొని వారికే సహకరిస్తున్నారని నిందించారు. అలానే నెల క్రితం తాము కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు ఎస్పీ సతీష్ కుమార్‌ని కలిసి ఫిర్యాదు చేశామని, దాంతో వాళ్ల ఆదేశాల మేరకు కేవలం శ్రీనివాసరెడ్డి, కిశోర్ రెడ్డిల లైసెన్సులు మాత్రమే నిలుపుదల చేసి చేతులు దులుపుకొన్నారని చెప్పారు. కలెక్టరేట్‌లో ఇన్‌ఛార్జ్ కలెక్టర్ భార్గవ తేజ అందుబాటులో లేకపోవడంతో డీఆర్‌వో షేక్ ఖాజావలికి వినతిపత్రం ఇచ్చి గ్రంథసిరి రైతులు అక్కడి నుంచి నిష్క్రమించారు.



నక్కబొక్కలపాడులో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ

ముందస్తుగా గంగమ్మ తిరునాళ్ల

● నక్కబొక్కలపాడులో టీడీపీ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభ ఏర్పాటు

బల్లికురవ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వీర్ల గంగమ్మ తిరునాళ్ల శనివారం జరగనుంది. తిరునాళ్ల ముందస్తు ఉత్సవాలలో భాగంగా గురువారం రాత్రి మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభను గ్రామంలో ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా విద్యుత్ ప్రభపై సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పాట కచేరిని ఏర్పాటు చేయడంతో పలు గ్రామాల నుంచి ప్రజలు తరలి వచ్చి వీక్షించారు. టీడీపీ పార్టీ ఆధ్వర్యంలో తిరునాళ్ల రోజు ఇదే గ్రామం నుంచి రెండు విద్యుత్ ప్రభలను తిరునాళ్లలో ఏర్పాటు చేయనున్నారు.

రోడ్డుపై పొంచిఉన్న ప్రమాదం

● కూలే స్థితిలో ఎండిపోయిన వృక్షం



మేదరమెట్లలో కూలేందుకు సిద్ధంగా ఉన్న చెట్టు

మేదరమెట్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మేదరమెట్ల నుంచి అద్దంకి వెళ్లే రోడ్డులో ఓ వేప చెట్టు ఎండిపోయింది. రోడ్డు పక్కనే ఉండడం వల్ల ఎండిన చెట్టు ఎప్పుడు మీద పడుతుందోనని పాదచారులు, వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. మేదరమెట్ల సెంటరు నుంచి నార్కెట్‌పల్లి రహదారి కలిసే ఫ్లైవోవర్ వరకు రోడ్డు విస్తరణ చేపట్టారు. నాలుగు వరుసల సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టినప్పుడు రోడ్డుకు ఇరువైపులా ఉన్న వందేళ్ల నాటి వేపచెట్లను తొలగించారు. అప్పుడు మిగిలిపోయిన ఈ వేపచెట్టు కొమ్మలు విద్యుత్ తీగలకు అడ్డంగా ఉందని, రహదారిపైకి వస్తున్నాయని తరచూ కొట్టివేస్తున్నారు. దీంతో వేపచెట్టు ఎండుముఖం పట్టింది. రోడ్డుపైకి వంగి ఉండడంతో ఎప్పుడైనా మీద పడుతుందోనని ఈ రహదారిన వెళ్లే పాదచారులు, వాహనాలపై వెళ్లేవారు ఆందోళన చెందుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు తక్షణమే స్పందించి ఎండిన చెట్టును తొలగించాల్సిందిగా గ్రామస్థులు కోరుతున్నారు.



దివ్యాంగులకు శ్రీనిధి రుణం అందజేస్తున్న ఏపీఎం, సీసీలు

దివ్యాంగులకు వడ్డీ లేని రుణం అందించాలి

చినగంజాం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు వడ్డీ లేని రుణాలు అందజేయాలని మండల దివ్యాంగుల సమాఖ్య అధ్యక్షురాలు మార్పు విశ్రాంతమ్మ అన్నారు. స్త్రీ శక్తి భవన్‌లో మండల దివ్యాంగుల సమాఖ్య సమావేశం గురువారం జరిగింది. విశ్రాంతమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏపీఎం గద్దె పెదసుబ్బారావు మాట్లాడుతూ ప్రతి సమావేశంలో దివ్యాంగుల అవసరాలను గుర్తించి, వాటిని తీర్చే విధంగా మండల సమాఖ్య పనిచేస్తుందని తెలిపారు. రాజుబంగారుపాలెం గ్రామానికి చెందిన సాయి దివ్యాంగుల గ్రూపునకు రూ.లక్ష శ్రీనిధి రుణం, ఎస్కే బాషాకు వాకర్ అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీసీలు కె.వెంకటస్వామి, లక్ష్మి, మాధవి, అకౌంటెంట్ పద్మావతి, పి.పార్థసారధి, వి.వేణు, హనుమంతరావు, అంకిరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ, డీఎస్పీ మొయిన్, సీఐ శేషగిరిరావు, ఎస్సై చంద్రశేఖర్, గ్రామస్థులు

గ్రామంలో ప్రశాంత వాతావరణం ఉండాలి

● గవినివారిపాలెంలో ఇటీవల జరిగిన హత్యాయత్నం కేసుపై పీస్ కమిటీ సభ్యులు

చీరాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గవినివారిపాలెం గ్రామం ప్రశాంత వాతావరణం ఉండేలా గ్రామస్థులు ప్రవర్తించాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ, డీఎస్పీ ఎండీ మొయిన్ అన్నారు. గురువారం రూరల్ సీఐ శేషగిరిరావు, ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయంలో గ్రామస్థులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇటీవల గ్రామంలో స్థల వివాదంలో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌పై పలువురు హత్యాయత్నానికి పాల్పడిన విషయంపై చర్చించారు. గ్రామాల్లో సమస్యలు నెలకొన్నప్పుడు పెద్దలు లేదా పోలీసులను ఆశ్రయించి పరిష్కారం పొందాలని సూచించారు. క్షణికావేశంలో దాడులకు పాల్పడి జైలుపాలు కావద్దని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం కుమారుడి కోసం పూజలు

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుమారుడు మార్క్‌శంకర్ త్వరగా కోలుకోవాలని జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు కొత్తపేట శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గూడూరు శివరామ ప్రసాద్, కిరణ్, కిషోర్, వెంకటస్వామి, వెంకటేశ్వర్లు, నాగలక్ష్మీ, భాగ్యలక్ష్మీ, శిరీష, అరుణ, వెంకటేశ్వరమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

ఆక్రమణలో జగనన్న కాలనీ స్థలాలు

గతంలో పనికిరాని చోట కేటాయింపు

ఇంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో కన్నేసిన ఆక్రమణదారులు

మరోచోట ఇవ్వాలంటూ ముక్తేశ్వరం పేదల విజ్ఞప్తి



ముక్తేశ్వరంలో నిరుపేదలకు ఇచ్చిన నివేశన స్థలాలను ఆక్రమించి వేసిన గడ్డి వాములు

బల్లికురవ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలకులు చేసిన తప్పిదాల వలన నిరుపేదలకు కేటాయించిన నివేశన స్థలాలు ఇప్పుడు ఆక్రమణదారుల చెరలోకి వెళ్లాయి. దీంతో తమకు ఇంటి స్థలం ఇచ్చి ఎలాంటి ఉపయోగం లేదని నిరుపేదలు గగ్గోలు పెడుతున్నారు. బల్లికురవ మండలం ముక్తేశ్వరం గ్రామంలో రెండేళ్ల కిందట జగనన్న కాలనీ పేరిట సుమారు 20 మందికి ఒక సెంటు చొప్పున ఇంటి స్థలాలను ఇచ్చారు. గ్రామానికి పడమర వైపున ఉన్న కొండ ప్రాంతంలో స్థలాలు కేటాయించారు. అక్కడ ఇంటి నిర్మాణాలకు ఉపయోగం లేదని లబ్ధిదారులు అధికారులకు తెలియజేశారు. అయినా వారు పట్టించుకోకుండా తమ పని తాము చేసి పట్టాలు చేతిలోపెట్టారు. కొందరు తమకు స్థలాలు వద్దని తీసుకోలేదు. తీసుకున్న వారు ఇంత వరకు ఒక్క ఇంటి నిర్మాణం చేపట్టలేదు. దీనిని అలుసుగా చేసుకొని గ్రామానికి చెందిన కొందరు జగనన్న కాలనీలో ఇంటి స్థలాలను ఆక్రమించుకొని వరి గడ్డి వాములను, పశువుల పాకలను ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. తమకు ఇంటి స్థలాలు ఇచ్చి కూడా లాభం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేదలందరికీ ఇంటిని కట్టించి ఇస్తానని జగన్‌రెడ్డి మోసం చేశారని, ఇప్పుడు ఇల్లూ లేదు, ఇంటి స్థలం లేకుండా పోయిందని అంటున్నారు. ఇదిలావుండగా జగనన్న ఇంటి స్థలాల మంజూరులో పెద్దఎత్తున అవకతవకలు జరిగాయని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం తమకు అనువైన చోట ఇంటి స్థలాలు కేటాయించి నిర్మించాలని లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే ఆక్రమణలో ఉన్న స్థలాలను కాపాడాలని వారు కోరుతున్నారు.

అటవీ, రెవెన్యూ శాఖల ఉమ్మడి సర్వే

● హద్దురాళ్ల గుర్తింపు కోసం వెతుకులాట



హద్దురాయి వద్ద అటవీ, రెవెన్యూ శాఖాధికారులు

కురిచేడు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కురిచేడు మండలం గంగదొనకొండ గ్రామం సర్వే నంబర్లు 88, 90లలో 799.40 ఎకరాల భూమిని రిలయన్స్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్‌కు కేటాయించారు. ఈక్రమంలో భారీ యంత్రాలతో చిల్లచెట్లు తొలగించే పనులు చేపట్టారు. అయితే, అటవీ శాఖ అధికారులు సదరు భూమి తమదంటూ అడ్డం తిరిగారు. గత మూడు రోజులుగా ఈ విషయమై అటవీ, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులు తర్జన భర్జనలు పడ్డారు. ఎవరి రికార్డులు వారు తెచ్చి మాదంటే మాదని వాదులాడుకున్నారు. చివరికి ఉన్నతాధికారులు ప్రవేశించి రెండు శాఖలు ఉమ్మడి సర్వే చేయాలని సూచించారు. గురువారం రెండు శాఖలకు చెందిన సర్వేయర్లు ఉమ్మడి సర్వే చేపట్టారు.

కురిచేడు మండలంలో రైతులకు, నిరుద్యోగులకు ఉపాధి చూపేందుకు కూటమి ప్రభుత్వం రూ.130 కోట్లతో గంగదొనకొండలో ప్రాజెక్టుకు ఏర్పాట్లుచేసింది. దీని వలన ప్రత్యక్షంగా రైతులు, నిరుద్యోగులకు పరోక్షంగా పరిసర గ్రామాల వారికి ఉపయోగం ఉంటుంది. ఇటువంటి పెద్ద ప్రాజక్టు అటవీ శాఖ కొర్రీలతో నీలినీడలు కమ్ముకున్నాయి. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయి విచారణ చేయాలని సూచించారు. గత మూడు రోజులుగా అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు వారి రికార్డులు సరిచూసుకున్నారు. ఒకరి రికార్డులు మరొకరు అందించుకుని సరి చూసుకున్నారు. గురువారం ఉమ్మడి సర్వేకు పూనుకున్నారు.

అటవీ శాఖకు చెందిన జిల్లా అధికారి శ్రీనివాసరావు, కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డిలు తమ శాఖల అధికారులతో కలసి గంగదొనకొండ పక్కనే ఉన్న నాయుడుపాలెం రిజర్వ్ ఫారెస్ట్‌లో 3 కి.మీ నుంచి 5 కి.మీ మేర నడచి హద్దురాళ్ళను గుర్తించారు. అక్కడ నుంచి సర్వే చేయాలని అనుకున్నా సాంకేతి సమస్యతో కుదరలేదు. మరలా దొనకొండ మండల చందవరం వద్ద ఉన్న అడవిలో హద్దురాయిని గుర్తించారు. అలాగే నాయుడుపాలెం రిజర్వ్ ఫారెస్ట్‌కు మూల స్తంభంలాంటి హద్దురాయిని దొనకొండ మండలం పోలేపల్లి వద్ద ఉందని అక్కడకు వెళ్ళి అక్కడ హద్దురాయిని గుర్తించారు. అక్కడ నుంచి జియోలాజికల్, ల్యాట్ ల్యాండ్ సర్వే చేశారు.

తదనంతరం దొనకొండ తహసీల్దార్ కార్యాలయానికి ఇరు శాఖల అధికారులు వెళ్లి రికార్డులు పరిశీలించి చర్చలు జరిపారు. ఉన్నతాధికారులకు సర్వే రిపోర్టులు పంపి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. సీబీజీ ప్లాంటు వద్ద పనులు యథావిధిగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు చెందిన కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డి, అసిస్టెంట్ డీఎఫ్‌వో పి.శ్రీనివాసరావు, ఎఫ్ఆర్‌వో నరసింహారావు, డిప్యూటీ ఆర్‌వో బి.నాయక్, ఎఫ్‌బీవో ధనలక్ష్మి, తహసీల్దార్ రజనీకుమారి, ఆర్ఐ నాగరాజు, వీఆర్వో హనుమంతరావు, సర్వేయర్లు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కొండయ్యను సత్కరిస్తున్న ప్రతినిధులు

ప్రజాసేవతో ఆనందం

● ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : నిరంతరం నియోజకవర్గంలో ప్రజా సేవల్లో ఉండడంతో ఎంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. గురువారం 216 జాతీయ రహదారి మన్నం అపార్ట్‌మెంట్ సమీపంలోని అక్కయ్యపాలెం పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. వేసవి దాహార్తికి ఒంగోలు వైపు వెళ్లే వారికి, రామాపురం వెళ్లే పర్యాటకులకు చలివేంద్రం ఎంతగానో దోహద పడుతుందని వివరించారు. అలాగే కొత్తపేటలోని గోపాల్‌నగర్ శ్రీసీతారామ మందిరం వద్ద నిర్వహించిన సమారాధనలో పాల్గొన్నారు. ఆయా ప్రాంత ప్రతినిధులు, నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.



మోదేపల్లిలో రక్షిత మంచినీటి పథకం పంపింగ్ స్కీంను పరిశీలిస్తున్న విద్యుత్ ఈఈ మస్తాన్‌రావు

మోదేపల్లికి నిరంతర విద్యుత్ సరఫరా

అద్దంకి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో కూడా నిరంతరాయంగా నాణ్యమైన త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరాకు చర్యలు చేపడుతున్నట్లు ఈఈ నల్లూరి మస్తాన్‌రావు అన్నారు. మండలంలోని మోదేపల్లిలో ఇటీవల విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటన సమయంలో వచ్చిన అర్జీల పరిష్కారంలో భాగంగా చేపట్టిన పనులను ఈఈ నల్లూరి మస్తాన్‌రావు గురువారం పరిశీలించారు. నిరంతరాయంగా త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేసేందుకు 100 కేవీ ట్రాఫ్స్‌ఫార్మర్‌లు మూడు, 53 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఒకటి ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పాత విద్యుత్ స్తంభాలను మార్పు చేయడం జరిగిందన్నారు. మోదేపల్లి వాటర్ స్కీంకు 24 గంటల విద్యుత్ సరఫరా కోసం 11 కేవీ విద్యుత్ లైన్‌ను రెండు కి. మీ. దూరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రూ.46లక్షల వ్యయంతో విద్యుత్ శాఖకు సంబంధించిన అన్ని పనులు పూర్తి చేశామన్నారు. డీఈఈ ముప్పాళ్ల దామోదరం, రూరల్ ఏఈఈ శివ ప్రసాద్, టీడీపీ నేతలు భీమని శ్రీనివాసరావు, ప్రసాద్, నర్రా వీరయ్య పాల్గొన్నారు.

కుంభకోణంపై.. కనికరం

(5వ పేజీ తరువాయి)

ఇదే తీరు. జగనన్న కాలనీల పేరుతో పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామంటూ స్థలం కొనుగోలు నుంచి ఇల్లు కట్టించి ఇచ్చే వరకు అంతటా అక్రమాలే. ఇందులో లబ్ధిదారులకు ఎటువంటి మేలు జరగకపోగా అటు అధికారులు, ఇటు నేతల మధ్య భారీగానే పంపకాలు జరిగాయి. పేదలకు ఇళ్ల స్థలాల కోసమని ప్రభుత్వం భూ సేకరణకు ప్రకటన చేయగా రైతులు ఎవరూ ముందుకు రాలేదు. ఈ క్రమంలో పెదరావూరులో టీడీపీ నాయకులతోనే సిఫార్సులు చేయించుకుని కొంత భూమిని కొని మార్కెట్ రేటుకు మించి అదనంగా రెండున్న రెట్లు డబ్బు చెల్లించారు. దీంతో మిగిలిన ప్రాంతాల్లో రైతులు ముందుకొచ్చారు. ఆ తర్వాత వైసీపీ నేతలు రంగంలోకి దిగి భూమాయ చేశారు. ఒక్క తెనాలిలోనే వైసీప దళారులు రంగప్రవేశం చేసి రైతుల వద్ద భూమిని తక్కువకు కొని రెండున్నర రెట్లకు ప్రభుత్వానికి ఇచ్చి భారీగా లబ్ధి పొందారు. పెదరావూరులో ప్రభుత్వం ఇచ్చిన నగదులో వాటాగా ఇవ్వమని నేతలు ఒత్తిడి చేయగా భూములను వెనక్కు తీసుకుంటామని రైతులు హెచ్చరించడంతో వదిలేశారని సమాచారం. మిగిలిన లేఅవుట్లలో అదనంగా డబ్బు వచ్చేలా చేసినందుకు ఎకరాకు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు నేతలకు మామూళ్ల కింద వసూలు చేశారు. 2019లో తెనాలి ఐతానగర్‌కు సమీపంలో ఉన్న భూములను ఎకరా రూ.38 లక్షలకు భూములు ఇచ్చేందుకు ప్రభుత్వంతో రైతులు ఒప్పందం చేసుకున్నారు. అయితే ఆ తర్వాత వైసీపీ హయాంలో పట్టణానికి 4 నుంచి 6 కిలోమీటర్ల దూరంలోని భూములకు రూ.92 లక్షలకు పైగా ముట్టచెప్పడం భూ కుంభకోణానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇలా ఒక్క తెనాలిలో రూ.393.51 కోట్లు ఖర్చుపెట్టి 526.36 ఎకరాల భూమిని రైతుల నుంచి కొనుగోలు చేశారు. ఒక్క తెనాలిలో మాత్రమే రూ.100 కోట్లకు పైగా చేతులు మారితే, రాష్ట్రం మొత్తంలో ఏ మేర భూ కుంభకోణం జరిగిందనేది ఊహకే అందని విషయం. ఎకరాకు రూ.10 లక్షలు, రూ.17.5 లక్షల చొప్పున వాటాలిచ్చినందుకు తమకు ఇబ్బందేమీ లేదని, తమకు మార్కెట్ రేటుపై పెద్ద లాభమే జరిగిందని, ఆ విశ్వాసంతో కుంభకోణం జరిగినట్లు చెప్పడానికి రైతులు ముందుకు రావడంలేదని సమాచారం.

ఖాతాలు శోధిస్తే గుట్టురట్టు

రైతుల ఖాతాలకు ప్రభుత్వం నుంచి వచ్చిన నగదును డ్రా చేసి అదే రోజు కొన్ని ఖాతాల్లో జమ చేసినట్లు తెలిసింది. కేవలం వీటికోసమే కొన్ని కొత్త ఫరం ఖాతాలు తెరిచారని, మరికొన్ని వ్యాపార సంస్థల కరెంట్ ఖాతాలు కూడా వీటికోసం వాడుకున్నారు. పిండికొట్ల బజార్‌లోని కెనరాబ్యాంక్, ఐతానగర్‌లోని సిండికేట్ బ్యాంక్, స్టేట్‌బ్యాంక్, కోస్టల్ బ్యాంక్, బుర్రిపాలెం రోడ్డులోని బ్యాంక్ ఆఫ్ ఇండియా, మరికొన్ని బ్యాంక్‌లలో ముందే మాట్లాడుకుని బ్యాంక్ సిబ్బందితో ఒప్పందం చేసుకున్నాకే లావాదేవీలు ఏ ఆటంకం లేకుం డా చేసుకున్నారని చెబుతున్నారు. ఈ ఖాతాలు పట్టుకుంటే గుట్టంతా బయటకు వస్తుందని చెబుతున్నారు. అయితే ఆయా బ్యాంక్‌లలో అప్పట్లో ఉన్న మేనేజర్‌లు, ఇతర సిబ్బంది సహకారం పుష్కలంగా ఉండటంవల్లే ఇవన్నీ సాధ్యం అయ్యా యని, వారిని కూడా విచారిస్తే తేలికగా బండారం బయటకు వచ్చే అవకాశం ఉందంటున్నారు.

అధికారుల తీరుపై అనుమానాలు..

తెనాలిలో జరిగిన భూ కుంభకోణంపై తొలి నుంచి ఆలపాటి విచారణకు పట్టుబడుతూ వచ్చారు. అప్పట్లో వైసీపీ సర్కారు పట్టించుకోకపోతే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. భూ కొనుగోళ్ల జరిపిన బుర్రిపాలెం, నేలపాడు, పెదరావూరు, కొలకలూరు, అంగలకుదురు, గుడివాడ, సంగంజాగర్లమూడి గ్రామాల్లోని నాడు భూములు విక్రయించిన రైతులను విజిలెన్స్ అధికారులు నెల నుంచి విచారిస్తున్నారు. ఆ మొత్తాలు బ్యాంక్ ఖాతాల ద్వారా కాకుండా నేరుగా డబ్బే తీసుకోవడంతో, రైతులు చెప్పే ఆధారాలు మినహా రికార్డు పరంగా ఏ ఆధారాలు లేకపోవడంతో వారు తమ పైకి ఏదీ రాదనే ధీమాతో ఉన్నట్లు సమాచారం. అయితే అప్పటి వీఆర్‌వోకు ఓ రైతు తన 2 ఎకరాలకు వచ్చిన డబ్బులో రూ.1.5 లక్షలు ఇచ్చినట్లు చెబుతున్నారు. ఆ బ్యాంక్ ఖాతాలు పట్టుకోగలిగితే గుట్టు వీడుతుంది. అయితే విచారణ సాగుతున్న తీరు చూస్తే కుంభకోణం గుట్టరట్టు చేసేలా కాకుండా అక్రమార్కులను కాపాడేలా ఉన్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

అధికారులకూ భారీగానే..

పేదల ఇళ్లకోసం కొన్న భూముల్లో నేతలకు మేళ్లు చేసి పెట్టినందుకు అధికారులకూ భారీ గానే ముడుపులు అందినట్లు సమాచారం. ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేశారన్న ఆరోపణలున్నాయి. గోలీల డొంక లేఅవుట్‌లో ఎకరాకు రూ.2 లక్షల చొప్పు న 60 ఎకరాల్లో రూ.12 కోట్లు వసూలు చేసి రెవెన్యూ అధికారులు పంచుకున్నట్టు సమాచారం. మిగిలిన లేఅవుట్లలో వచ్చిన వాటాలు కలిపితే రూ.15 నుంచి రూ.20 కోట్ల వరకు అధికారులకు దక్కి ఉంటుందనేది అంచనా.

నేడు సీతారాముల కల్యాణం

మార్టూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఈశాన్య రామాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు గురువారం ప్రకటనలో తెలిపారు. స్వామివారి కల్యాణం అనంతరం భక్తులకు అన్నప్రసాదవితరణ జరుగుతుందని, సాయంత్రం సీతారాముల ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం న్విహిస్తామన్నారు. కార్యక్రమానికి భక్తులు విశేషంగా తరలిరావాలని వారు కోరారు.

నేడు మార్టూరులో ఉరుసు వేడుకలు

షేక్ హజరత్ కరిముల్లాషావలి ఉరుసువేడుక శుక్రవారం జరుగనుంది. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం జెయింట్ వీల్, రంగులరాట్నాలు వచ్చి చేరాయి. స్థానికంగా కొణిదెన రోడ్‌లో దర్గా వద్ద శుక్రవారం ఉదయం వేడుకలను కమిటీ సభ్యులు ప్రారంభిస్తారు.

14న కోనంకిలో క్రికెట్ టోర్నమెంట్

మండలంలోని కోనంకి గ్రామంలో ఈ నెల 14న సోమవారం జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్నట్లు కమిటీ సభ్యులు గురువారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు 9390485540 సెల్ నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

తహసీల్దార్‌కు వీఆర్‌ఏల వినతి

సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరుతూ గురువారం యద్దనపూడిలో తహసీల్దార్ కే రవికుమార్‌కు గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం వారు వినతిపత్రం అందచేశారు. వారు తమ వినతి పత్రంలో తెలంగాణ మాదిరిగా పే స్కేలును అమలు చేయాలని,నామినీ వీఆర్‌ఏలను రెగ్యులర్ చేయాలని, అర్హతలు ఉన్న వారికి ప్రమోషన్లు కల్పించాలని పేర్కొన్నారు.

పీహెచ్‌సీకి పరికరాల అందజేత

ఇంకొల్లు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఏపీ గ్రానైట్ మిడ్వెస్టు ప్రైవేటు లిమిటెడ్ చీమకుర్తి వారు కార్పొరేటు సోషల్ రెస్పాన్సిబిలిటీ స్కీం కింద మెడికల్ పరికరాలు, ఫర్నిచర్ అందజేసారు. బేబీ వార్మర్, బీపీ ఆపరేటర్, కంప్యూటర్, వేయింగు మిషన్, నెబలైజర్, సక్షన్ ఆపరేటర్, మెడికల్ ఆఫీసర్ కుర్చీతో పాటు ఫర్నిచర్‌ను గురువారం అందజేయగా వైద్యాధికారి అంజలీ దాతలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటు సోషల్ రెస్పాన్సిబిలిటీ స్కీం ప్రతినిధి ఏ.శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, జయరామిరెడ్డి, దుర్గారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లల బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులదే

శ్రీహర్షిణి వార్షికోత్సవంలో చైర్మన్ గోరంట్ల

మార్టూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పిల్లలను బడికి పంపించడంతో తమ బాధ్యత తీరిందని అనుకోకుండా వారిలో నైతికవిలువలు, క్రమశిక్షణతో కూడిన విద్యను అందించే బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందని శ్రీహర్షిణి విద్యా సంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్ అన్నారు. గురువారం రాత్రి మార్టూరు లో శ్రీహర్షిణి విద్యా సంస్థల వార్షిక వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు మంచి మార్కులను సాధించడం అందరికీ ఆనందంగానే ఉంటుందన్నారు. అయితే ప్రస్తుత సమాజంలో విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరడానికి మంచి దారులు ఉన్నట్లే, తప్పుడు మార్గం వైపు పయనించడానికీ దారులున్నాయన్నారు. ఈ నేపథ్యంలో పిల్లల నడవడిక, ప్రవర్తనలపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. అనంతరం వివిధ ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రతిభ చూపించిన విద్యార్థులకు ఉపాధ్యాయుల సమక్షంలో వేదికపై బహుమతులను అందజేశారు.



పోటీల్లో ప్రశంసాపత్రాలను పొందిన చిన్నారులతో చైర్మన్ గోరంట్ల, ఉపాధ్యాయులు



మున్సిపల్ అడ్మిని స్ట్రేషన్ డైరెక్టర్ సంపత్, సెక్రటరీ సురేష్ నుంచి అవార్డును అందుకుంటున్న కమిషనర్ రవీంద్ర

ఇంటి పన్ను వసూలులో అద్దంకికి రెండవ స్థానం

● అవార్డు అందుకున్న కమిషనర్

అద్దంకి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పన్ను వసూలులో అద్దంకి మున్సిపాలిటీ రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో గురువారం విజయవాడలో జరిగిన వర్క్‌షాప్‌లో అద్దంకి మున్సిపల్ కమిషనర్ రవీంద్ర మున్సిపల్ అడ్మిని స్ట్రేషన్ డైరెక్టర్ సంపత్, సెక్రటరీ సురేష్ నుంచి అవార్డు అందుకున్నారు. నగదు అవార్డుతో పాటు మెమొంటో, సర్టిఫికెట్ అందుకున్నారు. మున్సిపల్ కమిషనర్ రవీంద్రకు పలువురు అభినందనలు తెలిపారు.

కేఆర్‌కేలో ఎన్‌సీసీ రైజింగ్ డే

అద్దంకిటౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కళాశాలల నుంచి ఎటువంటి ఆర్థిక లావాదేవీలతో సంబంధం లేకుండా విద్యార్థులను రిపబ్లిక్ డే క్యాంప్, థల్ సేవా క్యాంప్, ఎన్‌సీసీ క్యాంప్‌లకు ఉచితంగా తీసుకెళ్తామని లెఫ్టినెంట్ కల్నల్ ఎస్ఎస్ పరమార్ అన్నారు. గురువారం కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ రైజింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి లెఫ్టినెంట్ కల్నల్ ఎస్ఎస్ పరమార్ హాజరై ఎన్‌సీసీ జెండాను ఆవిష్కరించారు. కళాశాలకు ఎన్‌సీసీ యూనిట్‌ను కేటాయించారు.

చెత్త సంపద తయారీపై దృష్టి సారించండి

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : చెత్త నుంచి సంపద తయారీ చేసేందుకు సిబ్బంది కృషి చేయాలని సాక్ (రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్) ఫైనాన్స్ మేనేజర్ విజయశేఖర్, జూనియర్ మేనేజర్ జానీ అన్నారు. గురువారం మండల పరిధిలోని రామన్నపేట పంచాయతీలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఎంపీడీవో రాజేష్ ఆధ్వర్యంలో పరిశీలించారు.

అందని హైవే పరిహారం

- ఏళ్లుగా భూములు కోల్పోయిన రైతుల నిరీక్షణ
- జిల్లాలో జోరుగు సాగుతున్న 167ఏ జాతీయ రహదారి నిర్మాణ పనులు
- ఈ ఏడాది ఆఖరుకు పనులు పూర్తయ్యే అవకాశం

చీరాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : వాడరేవు నుంచి పిడుగురాళ్ల వరకు నూతనంగా నిర్మాణం జరుగుతున్న 167ఏ జాతీయ రహదారి నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. రూ.667 కోట్ల నిధులతో వాడరేవు నుంచి కారంచేడు, పర్చూరు. చిలకలూరి పేట, నరసరావుపేట మీదుగా పిడుగురాళ్ల వద్ద నకరికల్లు అడ్డరోడ్డు వరకు నిర్మాణాలుగు జరుగుతున్నాయి. ఈక్రమంలో బాపట్ల జిల్లాలో సుమారు 45 కిలో మీటర్లు వరకు రహదారి ఉండనుంది. ఈక్రమంలో ప్రారంభమైన జాతీయ రహదారితో తెలంగాణకు సైతం అతి తక్కువ సమయంలో చేరుకునే అవకాశం ఉంది. తద్వారా వివిధ రకాల వ్యాపారాలు సైతం కొనసాగేందుకు సులువైన మార్గం కా నుంది. అంతేకాకుండా రహదారి నిర్మాణంతో చీరాల తీర ప్రాంతానికి వచ్చే పర్యాటకుల సంఖ్య రెట్టింపయ్యే అవకాశం కూడా ఉంది.



వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల ప్రాంతంలో నిర్మిస్తున్న హైవే



ఈపూరుపాలెం స్ట్రయిట్ కట్ వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి పిల్లర్స్

పరిహారం కోసం పాట్లు

ఇదిలావుంటే జాతీయ రహదారి నిర్మాణానికి భూ సేకరణ జరిగిన సమయంలో అధిక సంఖ్యలో రైతులు వారు సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్న భూములను తప్పని పరిస్థితులలో నిర్మాణానికి అప్పచెప్పాల్సి వచ్చింది. అదే క్రమంలో సంబంధిత అధికారులు సైతం నష్ట పరిహారం అందించేందుకు ఆయా యజమానుల వద్ద అన్ని రకాల పత్రాలను అందుకుని ఆన్‌లైన్ చేశారు. ఈక్రమంలో రెండేళ్ల గడిచిన అనంతరం పరిహారం కొందరికి మాత్రమే అందినట్లు రైతులు చెప్తున్నారు. ఇంకా అందని వారు మాత్రం ఆందోళన చెందుతున్నారు. మరోపక్క పనులు జరుగుతుండడంతో తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. అధికారులు వెంటనే పరిశీలన చేసి పరిహారం అందించాలని భూ యజమానులు కోరుతున్నారు.

సుమారు ఎకరన్నర భూమి కోల్పోయాం



జాతీయ రహదారి నిర్మాణంలో నా అన్నది, నాది సుమారు ఎకరన్నర భూమి కోల్పోయాం. సాగు చేసి జీవించే భూమి కోల్పోవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ప్రభుత్వం నష్ట పరిహారం అందజేస్తామని హామీ ఇచ్చింది. నేటికీ అందలేదు. అధికారులు సమస్యను పరిష్కరించాలి.

- డీ చిన్న మోషే, భూ యజమాని

పరిహారం నోటీసులకే పరిమితం

భూ సేకరణలో భాగంగా 43 సెంట్లు కోల్పోయాను. ఆ సమయంలో అధికారులు నోటీసులు కూడా ఇచ్చారు. పరిహారం మాత్రం అందలేదు. రెండేళ్లు గడుస్తున్నా మా గోడు పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించాలి.

- ఏసోబు, భూ యజమాని

మూడు దఫాలుగా పరిహారం అందజేశాం



భూ సేకరణ జరగగానే యజమానులకు పరిహారానికి సంబంధించి నోటీసులు అందజేశాం. గతంలో పరిహారం ఆలస్యమైనది వాస్తవమే. కానీ కొంతకాలంగా యజమానుల ఖాతాల్లో నగదు జమ జరుగుతుంది. ఇప్పటికే మూడు దఫాల్లో పరిహారం అందజేశాం. కోర్టు వివాదాలు, అగ్రిమెంట్‌ల పరిశీలన జరుగుతున్నాయి. తప్పకుండా నిర్వాసుతు లందరికీ పరిహారం అందజేస్తాం

- గోపీకృష్ణ, తహసీల్దార్, చీరాల మండలం



మైక్రో ఫైనాన్స్ ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఎస్పీ మొయిన్

ఖాతాదారులపై బెదిరింపులకు పాల్పడితే చర్యలు

డీఎస్పీ ఎండీ మొయిన్

చీరాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : రికవరీలకు వెళ్లిన ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులు ఖాతాదారులపై బెదిరింపులకు పాల్పడితే చర్యలు తప్పవని డీఎస్పీ ఎండీ మొయిన్ అన్నారు. గురువారం వన్‌టౌన్‌లో చీరాల పరిధిలోని ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ ఇటీవల కాలంలో కొంతమంది రికవరీ ప్రతినిధులు ఖాతాదారుల ఇళ్ల వద్ద హల్‌చల్ చేస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. ఈ క్రమంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉన్నందున పరిధి దాటి ప్రవర్తించరాదని హెచ్చరించారు. బాకీ చెల్లింపుల్లో జాప్యం ఉంటే సున్నితంగా వ్యవహరించాలని, అదీ లేకుంటే లీగల్‌గా ప్రొసీడ్ అవ్వాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ శేషగిరిరావు, ఎస్సై రాజ్యలక్ష్మీ సిబ్బంది పాల్గొన్నారు.

గంగమ్మ తిరునాళ్లకు బందోబస్తు

బల్లికురవ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : వీర్ల గంగమ్మ తిరునాళ్ల శనివారం ప్రశాంతంగా జరిగేలా ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని సంతమాగులూరు సర్కిల్ సీఐ వెంకట్రావు తెలిపారు. గురువారం వీర్ల గంగమ్మ దేవాలయాన్ని సీఐ, వెంకట్రావు, ఎస్ఐ నాగరాజు పరిశీలించారు. ఈసందర్భంగా వారు ప్రభలు ఏర్పాటు స్థలం వద్ద ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నారు. ప్రజలు కూడా తిరునాళ్ల సందర్భంగా ఎలాంటి అల్లర్లకు పాల్పడకుండా ప్రశాంతంగా తిరునాళ్లకు వచ్చి వెళ్లాలని వారు కోరారు. అలానే రద్దీ ఎక్కువగా ఉంటే నలువైపులా వాహనాల పార్కింగ్‌కు ఎర్పాటు చేస్తామని వారు తెలిపారు.

కోలాహలంగా బార్ అసోసియేషన్ నామినేషన్

ఇప్పటికే ఇద్దరు ఏకగ్రీవం

చీరాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : బార్ అసోసియేషన్ నామినేషన్ ప్రక్రియ గురువారం కోలాహలంగా ముగిసింది. బార్‌లో ప్రస్తుతం 201 మంది న్యాయవాదులు ఓటు హక్కు కలిగి ఉన్నారు. మొత్తం ఎనిమిది విభాగాలకు సంబంధించి గురువారం నామినేషన్‌లు స్వీకరించారు. 12వ తేదీన విత్ డ్రాలకు అవకాశం. 15వ తేదీన ఎన్నికలు, అదే రోజు సాయంత్రం ఫలితాలు వెల్లడించనున్నారు. ఈక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి ఇప్పటికే రెండు సార్లు కొనసాగిన రమేష్‌బాబు, సీనియర్ న్యాయవాది కొమ్మనబోయిన నాగేశ్వరరావు నామినేషన్ దాఖలు చేశారు. ఉపాధ్యక్షుడిగా విజయ్‌కుమార్, తారక రామారావు, సెక్రటరీకి అశోక్ కుమార్, రవికుమార్ పోటీ పడ్డారు. అలాగే ట్రెజరీగా రామకోటేశ్వరరావు, రామకృష్ణ నామినేషన్ వేశారు. లైబ్రరీగా కామేశ్వరరావు, కల్పన, కల్చరర్ సెక్రటరీగా రాజా సాల్మన్, జాయింట్ సెక్రటరీగా సయ్యద్ మస్తాన్‌వలి వేయడంతో రెండు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మహిళా ప్రతినిధిగా స్నేహ, కల్పన నామినేషన్ వేశారు. వీటికి సంబంధించి ఎన్నికలు ఈ నెల 15వ తేదీన జరుగనుండగా, అదేరోజు సాయంత్రం ఫలితాలు వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.

కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి

మార్క్‌ఫెడ్ జిల్లా డీఎం కరుణ

అడుసుమల్లి (పర్చూరు), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్క్‌ఫెడ్ జిల్లా డీఎం కరుణ అన్నారు. గురువారం మండల పరిధిలోని అడుసుమల్లి గ్రామంలో పీఏసీఎస్ బ్యాంక్ ఆధ్వర్యంలో మార్క్‌ఫెడ్, నాఫెడ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన అపరాల కొనుగోలు కేంద్రాన్ని డీఎం ప్రారంభించారు. ఈసందర్భంగా రైతులనుద్దేశించి ఆమె మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేసేందుకే ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మినుము, శనగ, పెసలు వంటి అపరాలను ఈ-కేంద్రాల ద్వారా విక్రయించుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో అడుసుమల్లి పీఏసీఎస్ సీఈవో రమాదేవి, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



అపరాల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి కొనుగోలు చేస్తున్న మార్క్‌ఫెడ్ డీఎం కరణ, సిబ్బంది, రైతులు

కొండమంజులూరు పాఠశాలలో భోజనశాల

- రూ.15లక్షలతో ఏర్పాటు
- ప్రారంభించిన సింహపురి ఎక్స్‌ప్రెస్ హైవే ప్రతినిధులు, నేతలు

పంగులూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండమంజులూరు ఉన్నత పాఠశాలలో సింహపురి ఎక్స్‌ప్రెస్ హైవే ఇంటరైజ్ సంస్థ సంయుక్తంగా రూ.15లక్షల వ్యయం తో భోజనశాలను నిర్మించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ పథకంలో భాగంగా పాఠశాల బాల, బాలికలు భోజనం చేసేందుకు అత్యాధునిక వసతులతో నిర్మించబడిన ఈ నూతన భోజనశాలను గురువారం హైవే ప్రాజెక్ట్ హెడ్ శివకుమార్, ఆపరేషన్స్ మేనేజర్ ఆనంద్‌సింగ్, రౌండ్‌టేబుల్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి వెంకటేష్ స్థానిక ప్రతినిధులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఐ.అణిత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సింహపురి ఎక్స్‌ప్రెస్ హైవే ఆపరేషన్స్ మేనేజర్ ఆనంద్‌సింగ్‌ను పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ గోలి సంధ్యారాణి, నేతలు చింతల సహదేవుడు, బత్తుల వెంకటరావు ఘనంగా సత్కరించారు. 450 మంది విద్యార్థులు చదువుతున్న కొండమంజులూరు ఉన్నత పాఠశాలలో రూ.15లక్షలతో నూతన భోజనశాల నిర్మించి విద్యార్థులు కూర్చొని భోజనం చేసేందుకు స్టీలు బెంచీలను సమకూర్చిన సింహపురి ఎక్స్‌ప్రెస్ హైవే అధికారులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సింహపురి ఎక్స్‌ప్రెస్ హైవే సీనియర్ మేనేజర్ కోటేశ్వరరావు, బొల్లాపల్లి టోల్‌ప్లాజా ప్రతినిధి నరసింహారావు, స్టాఫ్ సెక్రటరీ బత్తుల రాంగోపాల రెడ్డి, చింతల సహదేవుడు, బత్తుల వెంకటరావు, మాజీ సర్పంచ్ సత్యవర్ధన్ రావు, కోటయ్య, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



భోజనశాలలో విందును ఆరగిస్తున్న పాఠశాల బాలబాలికలు



భోజనశాలను ప్రారంభిస్తున్న సింహపురి ఎక్స్‌ప్రెస్ హైవే ప్రతినిధులు, నేతలు

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

చినగంజాం, ఏప్రిల్ 10 : డీఎస్సీ రిక్రూట్‌మెంట్-2025 పరీక్షలకు ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ కోసం అర్హులైన జిల్లాకు చెందిన బీసీ, ఈబీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ తెలియజేసినట్లు ఎంపీడీవో ఎ.శ్రీనివాసమూర్తి గురువారం ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తులను వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారిత అధికారి కార్యాలయం, బాపట్ల జిల్లా వారికి చేసుకోవాలని సూచించారు. ఉచిత ఆన్‌లైన్ శిక్షణ కోసం టెట్ పరీక్ష క్వాలిఫై అయిన అభ్యర్థులు మాత్రమే అర్హులని, అభ్యర్థుల ఎంపిక విధానం టీటీసీ మార్కుల ఆధారంగా ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ నిర్వహిస్తారని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు బయోడేటాతో పాటు టెన్త్, టీటీసీ మార్కులిస్ట్, టెట్ మార్కులిస్ట్, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం(తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1,00,000లోపు మాత్రమే), ఆధార్, బ్యాంక్ పాస్ పుస్తకం జిరాక్స్, రెండు పాస్ పోర్టు సైజ్‌ఫొటోలు జతపరిచి వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారిత అధికారి. జిల్లా కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9963633578, 6309335544 సెల్ నెంబర్లను సంప్రందించాలని తెలిపారు.

అద్దంకిటౌన్ : డీఎస్సీ రిక్రూట్‌మెంట్-2025 పరీక్షలకు ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ కోసం అర్హులైన జిల్లాకు చెందిన బీసీ, ఈబీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో బత్తిన శింగయ్య గురువారం ప్రకటనలో తెలిపారు. ఉచిత ఆన్‌లైన్ శిక్షణ కోసం టెట్ క్వాలీఫై అయిన అభ్యర్థులు అర్హులన్నారు. వివరాలకు వరాలకు 9963633578, 6309335544ను సంప్రదించాలని తెలిపారు.

13న ఉచిత నేత్ర శిబిరం

పర్చూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులోని బీఏఆర్ అండ్ టీఏ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఈనెల 13న శంకర్ కంటి ఆసుపత్రి పెదకాకాని, చిన్నయ మిషన్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పాబోలు ఉదయ్ భాస్కర్ గురువారం ప్రకటనలో తెలిపారు. విద్యాదాత పాబోలు రాధాకృష్ణమూర్తి జ్ఞాపకార్థం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు శిబిరం అందుబాటులో ఉం టుందన్నారు. రోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని చేసుకోవాలని కోరారు.

డ్రెయిన్ నిర్మాణ పనులు ప్రారంభం

పంగులూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భగవాన్‌రాజుపాలెం వద్ద జాతీయ రహదారి పక్కన డ్రైన్ నిర్మాణ పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ నెల ఒకటవ తేదీన మంత్రి గొట్టిపాటి రవికుమార్ బీఆర్‌పాలెం ఎస్సీ కాలనీలో పింఛన్‌ల పంపిణీ చేస్తున్న సందర్భంలో రోడ్డుపై మురుగు పేరుకుపోవడం చూసి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన అదికారులు గురువారం కాలనీలో మురుగు ముందుకు పోయేలా ఫ్లైవోవర్ పక్కన అప్రోచ్ రోడ్డు వైపు డ్రైన్ ఏర్పాటుకు తహసీల్దార్ సింగారావు, ఎస్ఐ వినోద్‌బాబు పంచాయతీ, హైవే సిబ్బందితో కలసి చర్యలు చేపట్టారు. మురుగు కాలువలలో ఉన్న పూడికను వెంటనే తొలగించాలని పంచాయతీ కార్యదర్శి రవూఫ్‌ఖాన్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో హైవే, పోలీస్, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీలకు 400 మంది విద్యార్థుల హాజరు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జ్యోతీరావుపూలే, అండేడ్కర్ జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయిలో విద్యార్థులకు పూలే, అంబేద్కర్ వ్యాసరచన, వక్తృత్వ పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ పోటీ పరీక్షలను హెచ్‌ఎంలు కేవీ శ్రీనివాసరావు, గోపతోటి శ్యాంసన్ ప్రారంభించారు. ఈ పరీక్షలకు వివిధ పాఠశాలల నుంచి 400 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో పూర్ణచంద్రరావు, కిరణ్‌కుమార్, ఆంజనేయులు, శ్రీకృష్ణ, రాజశేఖర్, అంకమ్మరావు నాగయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సుబ్బరాజు, సిబ్బంది

ట్రాఫిక్ నిబంధనలు తెలియాలి

విద్యార్థి దశ నుంచే అవగాహనతో రోడ్డు ప్రమాదాల నివారణ

అద్దంకి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని అద్దంకి టౌన్ సీఐ సుబ్బరాజు అన్నారు. పలు పాఠశాలలు, కళాశాల విద్యార్థులకు గురువారం స్థానిక భవానీ సెంటర్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్, నిబంధనలపై సీఐ సుబ్బరాజు, సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ సుబ్బరాజు మాట్లాడుతూ వాహనచోదకులు, పాదచారులు పట్టణాలలో ప్రయాణించేటప్పుడు కచ్చితంగా ట్రాఫిక్ సిగ్నల్స్‌ను బట్టి ప్రయాణించాల్సి ఉంటుందన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ అనుచరించటం, ట్రాఫిక్ నిబంధనలు పాటించటం ద్వారా ప్రమాదాలు తగ్గుతాయన్నారు. హెల్మెట్ వాడాల్సిన అవసరాన్ని వివరించారు. తల్లిదండ్రులు కచ్చితంగా హెల్మెట్ వినియోగించేలా విద్యార్థులు పట్టుబట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాల సమయంలో హెల్మెట్ ఎలా రక్షణ కవచంగా ఉంటుందో ఇళ్లల్లో తల్లిదండ్రులకు వివరించాలన్నారు. మైనర్లు మోటార్ సైకిళ్లను నడపరాదని సుబ్బరాజు సూచించారు.

నేడు వసతి గదులకు భూమి పూజ

బల్లికురవ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ సంతమాగులూరు మండలాల్లో శుక్రవారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కేజీబీవీ విద్యాలయంలో వసతి గదుల నిర్మాణానికి భూమిపూజ చేయనున్నారు. సుమారు రూ.3 కోట్ల ప్రభుత్వ నిధులతో ఏల్చూరు, బల్లికురవ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలలో వసతి గదుల నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేయనున్నారని టీడీపీ నాయకుడు మలినేని గోవిందరావు తెలిపారు. రెండు విద్యాలయాలలో శిలా ఫలకాలను ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం 9.30కు ఏల్చూరు, 10.30కి బల్లికురవ గ్రామాలలో మంత్రి పర్యటనతోపాటు 11 గంటలకు ఏంపీడీవో కార్యాలయంలో ప్రజాదర్బార్‌లో భాగంగా ఆయన అర్జీలను స్వీకరిస్తారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పంగులూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పంగులూరులో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిప వేస్తున్నట్లు ఏఈ గోరంట్ల అనిల్‌కుమార్ తెలిపారు. నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటులో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని

విద్యుత్ పోల్‌ను ఢీకొన్న టిప్పర్

కారంచేడు(పర్చూరు), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ పోల్‌ను టిప్పర్ లారీ ఢీకొన్న ఘటన కారంచేడు - ఆదిపూడి మధ్య గురువారం జరిగింది. కారంచేడు నుంచి ఆదిపూడి వెళ్తున్న టిప్పర్ అతివేగంగా ప్రయాణిస్తూ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. విషయం తెలుసుకున్న విద్యుత్‌శాఖ ఏఈ రాంబాబు, సిబ్బందితో కలసి హుటాహుటిన చేరుకొని పరిశీలించారు. పడిపోయిన స్తంభాన్ని తొలగించినట్లు ఏఈ తెలిపారు. ఈవిషయంపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

మొక్కజొన్న పైర్ల ప్రదర్శన

చెరుకూరు(పర్చూరు), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండలం చెరుకూరు గ్రామంలో జీఎల్ -135 మొక్కజొన్న రకం పంటపై గురువారం రైతులతో కలసి క్షేత్ర స్థాయి ప్రదర్శన నిర్వహించారు. ప్రత్యామ్నాయ పంటల సాగుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాలలో ముగ్గురికి గాయాలు

అద్దంకి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : రెండు వేర్వేరు ప్రమాదాలలో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. అద్దంకి మండలంలోని తిమ్మాయపాలెం సమీపంలో ఇటుక బట్టీల వద్ద గురువారం వేకువజామున మార్టూరు మండలం కోలలపూడి నుంచి ముండ్లమూరుకు పొట్టు లోడుతో వెళ్తున్న ట్రాక్టర్, దర్శి నుంచి ఇంకొల్లు వెళ్తున్న మినీ లారీ ఎదురెదురు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మినీ లారీ డ్రైవర్ గోపిచంద్‌కు గాయాలు కావడంతో అద్దంకి వైద్యశాలకు తరలించారు. పొట్టు ట్రాక్టర్ ట్రాలీ రోడ్డుపై పడిపోయింది. అద్దంకి పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్‌సైకిల్ పై వెళ్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. అద్దంకి మండలం కొంగపాడుకు చెందిన కరి నాగేశ్వరరావు, కరి సాంబశివరావు గురువారం మధ్యాహ్నం మోటార్‌సైకిల్‌పై అద్దంకి వస్తుండగా వెనుక వైపు మేదరమెట్ల వైపు నుంచి అద్దంకి పట్టణంలోకి వస్తూ మార్కెట్ యార్డు పక్క నుంచి వేలమూరిపాడు రోడ్డులోకి వెళ్తున్న టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావుకు తీవ్ర గాయాలు కాగా, సాంబశివరావుకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, మెరుగైన వైద్యానికి ఒంగోలు తరలించారు.

వ్యక్తి ఆత్మహత్య

ఇంకొల్లు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భీమవరం గ్రామ సమీపంలో వ్యక్తి చింతచెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భీమవరం గ్రామానికి చెందిన పోలూరి మహేష్ (27) రెండురోజుల కిందట చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అనారోగ్య సమస్యలతోనే మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. అతని తండ్రి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మహేష్‌కు భార్య, కుమారుడు ఉన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

అద్దంకి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఏపీ పీటీడీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిష్కారించాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో గ్యారేజీ వద్ద గురువారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎంయూ డిపో చైర్మన్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అక్రమ సస్పెన్షన్‌లు, రిమూవల్స్‌ను ఆపాలన్నారు. ప్రమోషన్‌లను వెంటనే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ డిపో కార్యదర్శి అనపర్తి వందనం బాబు, ట్రెజరర్ అంజి, బాపట్ల జిల్లా వైస్ ప్రెసిడెంట్ రహ్మతుల్లా పాల్గొన్నారు.

నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేయాలి

ఇంకొల్లు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : నల్లబర్లీ పొగాకును ప్రభుత్వం కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని రైతు సంఘం, కౌలు రైతు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. స్థానిక స్థూపం సెంటర్‌లో గురువారం రైతులు పొగాకును తగలపెట్టి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి రామారావు, నాయకులు రామకోటేశ్వరరావు, ఆదెయ్య, కోటేశ్వరరావు, సాంబయ్య పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

చీరాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక సమస్యలతో వేటపాలెం మండలం మంకెనవారిపల్లికి చెందిన పిచ్చుక మల్లికార్జున (45) ఆత్మహత్యానికి పాల్పడ్డాడు. అతను స్థానిక పెట్రోల్‌బంక్‌లో పనిచేసి మానేశారు. ఏం జరిగిందోగాని శుక్రవారం అర్థరాత్రిధాటాక 3 లీటర్ల పెట్రోల్ కొనుక్కొని అతని ఇంటి సమీపంలో ఒంటిపై పోసుకొని అంటించుకున్నాడు. అనంతరం కేకలు వేయడంతో స్థాని కులు 108లో ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని, వివరాలు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.